PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం


Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 325 | విజయవాడ, శుక్రవారం 27 జూన్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 27 June 2025 | Rs

ఆరంభ శూరత్వమేనా..?

- సరిపడా రా మెటీరియల్ లేకుండా
- మూడో బ్లాస్ట్ ఫర్నేస్ పునఃప్రారంభానికి చర్యలు
- నేడు ప్లాంట్‌లో కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి పర్యటన
- 'ఉక్కు'ను నష్టాల్లోకి నెట్టేసేందుకేనని విమర్శలు 3



అంతా అనుకున్నట్లుగానే !

- ఐఎస్ఎస్‌తో అనుసంధానమైన డ్రాగన్
- ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించిన తొలి భారతీయుడుగా శుభాంశు రికార్డు
- అంతరిక్షం నుండి శుక్లా లైవ్ కాల్ 7



టీచర్‌ను పంపాలని నిమ్మలపాడు పాఠశాల వద్ద చేతులెత్తి నమస్కరిస్తూ వినూత్నరీతిలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గిరిజన విద్య పట్టదా?

తెరుచుకోని పాఠశాలలు • ఉపాధ్యాయుల కోసం ఎదురుచూపు • అనంతగిరి మండలంలో 38 బడుల్లో లేని టీచర్లు • అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లోనూ ఇదే స్థితి

'గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలందరూ పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రత్యేక బ్రిడ్జి కోర్సులు నిర్వహించాలి' గత విద్యాసంవత్సరంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన ఆదేశాలివి.

'మా లక్ష్యం ఓట్లు, సీట్లు కాదు. గిరిజన ప్రాంతాల్లో విద్య,వైద్యంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు మెరుగుపర్చడం' అడవితల్లి బాట కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన మాటలివి!

ప్రజాశక్తి - అనంతగిరి, అరకులోయ (అల్లూరి జిల్లా)

నేతలు ఇచ్చిన ఆదేశాలు, చెప్పిన మాటలు ఎలా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అడవి బిడ్డలకు విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభమై 15 రోజులవుతున్నా అల్లూరి జిల్లాలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ సహా పలు మండలాల్లోని గిరిజన పాఠశాలలు తెరుచుకోలేదు. ఉపాధ్యాయులు లేకపోవడమే దీనికి కారణం. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి. అయితే, డిప్యూటేషన్ మీద కొందరు ఉపాధ్యాయులను వేసి, మరికొన్ని చోట్ల సిఆర్‌టి(కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల)తోనూ బడులను నడిపించారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల డిప్యుటేషన్ ముగియడం, సిఆర్‌టిల కాంట్రాక్టు కాలం పూర్తిఅయింది. బదిలీల ప్రకియలో కొందరు ఉపాధ్యాయులను నియమించే అవకాశం ఉందని ప్రచారం జరిగినప్పటికీ, ఇంత వరకు అతీగతి లేని పరిస్థితి. దీంతో బడులను తెరిచే వారే లేని పరిస్థితి ఏజెన్సీలోని అనేక ప్రాంతాల్లో నెలకొంది. ఏరోజు కారోజు బడిదాకా వచ్చిన పిల్లలు ఊసురుమంటూ వెనక్కి తిరిగి వెళ్లాల్సిన పరిస్తితి ఏర్పడుతోంది. వీరిలో కొందరు చాలా దూరం నుండి చదువు మీద ఎంతో అశతో బడికి వస్తున్న విద్యార్థులు కూడా ఉన్నారు. బడికి తాళం వేసి ఉండటం. కనీస సమాచారం చెప్పేవారు కూడా ఉండకపోవడంతో వారికి నిరాశ ఎదురవుతోంది.ఐదో తరగతిని పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆరో తరగతికి హైస్కూల్‌కు వెళ్లాలంటే సర్టిఫికెట్ అవసరం. ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆ సర్టిఫికెట్ ఇచ్చే వారు కూడా లేని స్థితి కొన్ని పాఠశాలల్లో నెలకొంది. దీంతో వీరి ఉన్నత విద్యఅవకాశాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోంది.

ఎక్కడెక్కడ...?

ఒక్క అనంతగిరి మండలంలో 35 జిపిఎస్ (టిడబ్ల్యు) పాఠశాలలు, మూడు మండల పరిషత్ పాఠశాలలకు ఉపాధ్యాయులు రావడం లేదు. ఈ మండలంలోని వాలసి పంచాయతీ పరిధి నిమ్మలపాడు ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకుపైగా చదువుతున్నారు. పెద్దకోట పంచాయతీ పరిధి కుడియా పాఠశాలలో 30 మంది, వేలమామిడి పాఠశాలలో 60 మంది, కోనాపురం పంచాయతీ పరిధి కరాయిగూడ పాఠశాలలో 40 మందికిపైగా, ఎన్ఆర్.పురం పంచాయతీ బూరిగ పాఠశాలలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతోతమకు మాస్టారును కావాలంటూ పలుచోట్ల ఆందోళనలకు దిగుతున్నారు. అరకులోయ మండలం లోతేరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఏడు పాఠశాలల్లో ఇప్పటికీ ఉపాధ్యాయులు లేరు. వారిని నియమించకపోవడంతో నేటి వరకు పాఠశాలలకు తలుపులు తెరవలేదు. దీంతో తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఉంది. వంతలగూడ, తోడుబంధ, అడారి, ధనసానివలస, బొరకలవలస, లండిగూడ, కాగువలసల్లో ఈ పరిస్థితి నెలకొంది.



తెరుచుకోని కుడియా పాఠశాల



వడ్డీ రేట్లను అర శాతం తగ్గించాల్సిందే..!

- బ్యాంక్‌లకు స్పష్టం చేసిన ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : రుణ రేట్లను తగ్గించాలని బ్యాంక్‌లను ఆర్‌బిఐ కోరింది. జూన్ తొలి వారంలో జరిగిన ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఈ రేట్లను బ్యాంక్‌లు తమ ఖాతాదారులకు బదిలీ చేయాలని ఆర్‌బిఐ సూచించింది. రేటు కోతలను సమర్థవంతంగా బదిలీ చేయడానికి ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఆర్‌బిఐ తన బులిటెన్‌లో పేర్కొంది. ఇంతక్రితం ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ ప్రకటించిన వడ్డీ తగ్గింపును చాలా బ్యాంకులు ఇప్పటికే తమ రుణ గ్రహీతలకు బదిలీ చేశాయి. జూన్ 6న ఆర్‌బిఐ రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన కొన్ని రోజుల్లోనే ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌తో సహా అనేక పెద్ద బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్లను సవరించాయి. మరికొన్ని బ్యాంక్‌లు ఈ రేట్లను పూర్తిగా బదిలీ చేయకపోవడంతో ఆర్‌బిఐ తాజాగా సూచనలు చేసింది.

అఖండ గోదావరి ప్రాజెక్టు ప్రారంభం

- పాల్గొన్న కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్
- రూ.430 కోట్లతో ఏడు టూరిజం ప్రాజెక్టులు : పవన్ కళ్యాణ్ 3



యాంటి నార్కోటిక్స్ డే సందర్భంగా గుంటూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సిఎం చంద్రబాబు వార్త 2లో

స్పేస్ పాలసీతో రూ.25 వేలకోట్ల పెట్టుబడులు

లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీలు - సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రూ.25 వేల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా స్పేస్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ఏరోస్పేస్ పాలసీపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో . సమీక్షలో ఏరోస్పేస్ టెక్నాలజీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్పేస్ విజన్ 2047 కింద కేంద్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులు చేపడుతోందని, స్టార్‌లింక్, స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజన్ వంటి ప్రైవేటు ఆపరేటర్లు ఈ రంగంలో సంచలనాలు సృష్టించనున్నారని అనాన్నరు. భవిష్యత్ అంతా స్పేస్ రంగానిదేనని చెప్పారు. వ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెట్టుబడుల లక్ష్యం నెరవేరితే ప్రత్యక్షంగా ఐదువేల మందికి, పరోక్షంగా 30 వేలమందికి ఉపాధి వస్తుందని తెలిపారు లేపాక్షి, తిరుపతిలలో స్పేస్‌సిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యా సంస్థలను దీనిలో భాగస్వాములను చేయడం ద్వారా విద్యార్థులు ఈ రంగంవైపు ఆకర్షితులయ్యేలా చూడాలని అన్నారు. కమ్యూనికేషన్ రంగంలో ఉన్న సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలన్నారు. తెలిపారు. పెట్టుబడులను రూ.2.5 కోట్ల నుండి రూ.500 కోట్ల వరకూ వేర్వేరు కేటగిరీలుగా విభజించాలని సూచించారు. వారికి 25 శాతం నుండి 45 శాతం రాయితీ ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. లేపాక్షిలో 500 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న స్పేస్ సిటీలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆర్‌అండ్‌డి, స్పేస్ స్టార్టప్, ఇన్నోవేషన్, ఎకోసిస్టమ్, స్పేస్ అప్లికేషన్ల సేవలకు సంబంధించి సంస్థలు ఏర్పాటు చేయనున్నారు. తిరుపతి స్పేస్ సిటీలో తయారీకి, లాజిస్టిక్ సేవలు అందించే సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. లాంచ్‌వెహికల్, శాటిలైట్ పేలోడ్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. శ్రీహరికోట నుండి తిరుపతికి రోడ్ కనెక్టివిటీ అంశంపైనా సిఎం చర్చించారు.

హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల వివరాలు ఇవ్వండి


- వారంలోగా ఓటర్ల జాబితాల కాపీలు కావాలి
- ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ లేఖ రాసింది. ఓటర్ల జాబితా, పోలింగ్ రోజు నాటి వీడియో ఫుటేజీని ఇవ్వాలని డిమాండ్ చేసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలను లేఖలో ప్రస్తావించింది. రాహుల్ ఆరోపణలకు స్పందిస్తూ ఎన్నికల సంఘం రాసిన లేఖకు ప్రతిస్పందనగా కాంగ్రెస్‌కు చెందిన ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్ (ఈఎజిఎల్ఇ) ఈ తాజా లేఖ రాసింది. ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహల్‌కు ఈ లేఖ పంపింది. మహారాష్ట్ర, హర్యానా ఓటర్ల జాబితాల డిజిటల్, మెషిన్-రీడబుల్ కాపీలను వారంలోగా అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ తన లేఖలో స్పష్టంగా పేర్కొంది. అలాగే, పోలింగ్ రోజు వీడియో రికార్డింగ్‌ను ఇవ్వాలని కోరింది. తమ డిమాండ్‌ను పరిష్కరించడం ఎన్నికల సంఘానికి కష్టమైన పనేం కాదని తెలిపింది. తమ ఈ డిమాండ్ కూడా కొత్తదేం కాదని, ఈ విషయంలో పార్టీ చాలాకాలంగా డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలు, వీడియో ఫుటేజ్‌లను అందుకున్న వెంటనే తమ పార్టీ అగ్రనాయకత్వ బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధంగా ఉందని తెలిపింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలను బహిర్గతం చేసే డేటా, విశ్లేషణ తమ వద్ద ఉందని తెలిపింది.

2024 డిసెంబర్ నుండి ఇండియా వేదిక పార్టీల నాయకులు లేఖలు, పిటిషన్లు, కథనాలు, పత్రికా సమావేశాలు, పార్లమెంటులో ప్రసంగాల ద్వారా ఈ అంశాలను హైలైట్ చేస్తున్నామని పేర్కొంది.

"2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యలో అకస్మాత్తుగా భారీ పెరుగుదల, ఎన్నికల రోజు సాయంత్రం 5 గంటల తరువాత పోలింగ్‌లో వివరించలేని పెరుగుదల గురించి మేము చాలా వాస్తవమైన అంశాలను ముందుకు తెచ్చాం" అని పేర్కొంది. 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంటరీ ఎన్నికల మధ్య గత ఐదేళ్ల కంటే, 2024 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికలకు, రాష్ట్రంలో అదే సంవత్సరం నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు మధ్య ఎక్కువ మంది కొత్త ఓటర్లు జాబితాలో చేరారని గుర్తు చేసింది. 'మేం కోరుతున్నట్లుగా మీరు మాకు తుది ఓటర్ల జాబితాలను ఎందుకు ఇవ్వరు? మీరు చాలా కాలంగా దీనిని తప్పించుకున్నారు. అసలు ఈ ఓటర్ల జాబితాలు మీ వద్ద ఉన్నాయా? లేదా మీ వద్ద లేవా?" అని ప్రశ్నించింది. అలాగే, పోలింగ్ రోజు వీడియో ఫుటేజ్‌ను అందించకపోవడం మరిన్ని సందేహాలను, అనుమానాలను రేకెత్తిస్తుందని అని పేర్కొంది.



జమ్మూకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- ఉగ్రవాది మృతి

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది మరణిం చాడు. జిల్లాలోని బసంత్‌గఢ్ ప్రాంతంలో గురువారం ఉదయమే భారత సైన్యం, జమ్ముకాశ్మీర్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలి పారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే ఖచ్చితమైన సమాచారంతో తనిఖీలు ప్రారంభి ంచినట్లు చెప్పారు. ఉగ్రవాది మరణించిన తరువాత కూడా సాయంత్రం వరకూ కూడా ఇక్కడ తనిఖీలు కొనసాగాయి. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తరువాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున భద్రతా సిబ్బందిని మోహరించారు. అలాగే, జులై 3న అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. 38 రోజుల పాటు జరిగే ఈ యాత్ర కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

రేషన్ స్థానంలో నగదు బదిలీ..?

• అమలుకు ప్రభుత్వం చర్యలు • అందులో భాగంగానే ప్రజాభిప్రాయ సేకరణ • ఇకపై క్యూఆర్ ఆధారంగా అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదల ఆకలి తీర్చే రేషన్ సరఫరా స్థానంలో నగదు బదిలీని ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాపకింద నీరులా చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండియు) వాహనాలతో రేషన్ పంపిణీ విధానాన్ని కూటమి ప్రభుత్వం జూన్ నుంచి రద్దు చేసి, తిరిగి చౌకదరల దుకాణాల్లో రేషన్ పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా రేషన్‌లో డిబిటి విధానంపై పెద్ద చర్చకు తెరలేపింది. గత కొంత కాలంగా రేషన్ స్థానంలో నగదు బదిలీ చేయనున్నట్లు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు వేదికలపై ప్రకటించారు. డిబిటితో రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పేదలు, ప్రజా సంఘాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం అవడంతో బియ్యం వద్దనుకునే వారికే నగదు అంటూ మాట మార్చారు. ఇందుకు మూల కారణం కేంద్ర ప్రభుత్వం కూడా గత కొన్నేళ్లుగా రేషన్ స్థానంలో కార్డుదారులకు నగదును బదిలీ (డిబిటి) అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలను సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో మన రాష్ట్రంలో కూడా డిబిటి అమలుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. రేషన్ సరఫరాపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు నిర్వహించిన ఐవిఆర్ఎస్ సర్వేలో నగదు బదిలీ అంశంపై కార్డుదారులకు పలు ప్రశ్నలు సంధించింది. తాజాగా రేషన్ పంపిణీపై ప్రజాభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ వివరాలు వెల్లడిస్తూ.. రేషన్ షాపుల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేస్తారు. ఈ క్యూఆర్‌ను స్మార్ట్ ఫోన్‌లోని స్కానర్‌తో స్కాన్ చేస్తే వెబ్ షీట్ ఓపెన్ అవుతుంది. షాపు నెంబరు, కార్డు నెంబరు నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం అందులో ఐదు ప్రశ్నలు ఉంటాయి, వాటికి కేవలం 'అవును/కాదు' అని మాత్రమే సమాధానాలను కార్డుదారులు ఇవ్వాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. అయితే, అభిప్రాయ సేకరణ పేరుతో రేషన్ పంపిణీపై ప్రజల అసంతృప్తిని సాకుగా చూపి క్రమంగా రేషన్ సరఫరా స్థానంలో నగదు బదిలీని తీసుకువచ్చేందుకు కుట్ర ఇందులో దాగి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో కేంద్రం ఒత్తిడితో రేషన్ స్థానంలో నగదు బదిలీని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించినా.. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ అంశాన్ని వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టింది. తాజాగా కూటమి ప్రభుత్వం కేంద్రం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తోంది. ఈ క్రమంలోనే రేషన్ సరఫరాకు స్థానంలో నగదు బదిలీ విధానాన్ని తీసుకువచ్చేందుకు ఉత్సాహంతో ఉంది. ప్రస్తుతం రేషన్‌లో ప్రతి నెలా కేవలం బియ్యం, చెక్కర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఒకటి రెండు నెలలు మాత్రమే ఇచ్చి తరువాత నిలిపివేసింది. రేషన్‌లో ఇచ్చే సరుకుల సంఖ్యను 16 రకాలకు పెంచి రేషన్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన మిగతా 7లో

రేషన్ కార్డుల వివరాలు

రాష్ట్రంలో రేషన్ కార్డుదారుల సంఖ్య:	1,46,20,795
లబ్ధిపొందుతున్న పౌరులు:	4,24,34,176
ప్రతి నెలా సరఫరా చేసే బియ్యం:	2,31,349.73 టన్నులు
ప్రతి నెలా సరఫరా చేసే చెక్కెర:	15,501.77 టన్నులు
చౌకదరల దుకాణాల సంఖ్య:	29,796

నాటి, ఈనాటి చీకటి 'రాజ్యం'

ప్రజాశక్తి- అమరావతి

యాభయ్యేళ్ల క్రితం 1975 జూన్ 25 అర్ధరాత్రి ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిన రోజును ఇప్పుడు సంవిధాన్ హత్యా దివస్ (రాజ్యాంగ హత్యా దినం)గా మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్వహించడం విస్తుగొలుపుతోంది. ఇంతకుముందు బిజెపి పార్టీపరంగా జరిపే ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ప్రభుత్వ పరంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర సాంస్కృతిక శాఖ తాఖీదులివ్వడం మరో వైచిత్రి. ఎమర్జెన్సీ నాటి చీకటి కోణాలన్నీ ప్రస్తావించలేం కానీ నాటికీ నేటికీ నిర్బంధంలో సామ్యం గమనించవచ్చు. ఇప్పటి బిజెపి పాలకులకు లేదా వారి పూర్వాశ్రమానికీ ఎమర్జెన్సీ నాటి నిర్బంధానికి సంబంధం వుందా లేక ఆ ప్రభుత్వానికి లొంగుబాటుగా వ్యవహరించారా అన్నదీ పరిశీలించవచ్చు. నాడు నేడు నిర్బంధానికి గురవుతున్నదెవరో కూడా గుర్తించడం అవసరం.

నిర్బంధాలు... జైళ్లలో కుక్కడం..

ఎమర్జెన్సీ అంటేనే చెప్పాపెట్టకుండా నిర్బంధించడం, నెలలు, ఏళ్ల తరబడి జైళ్లలో విచారణ కూడా లేకుండా ఉంచడం అన్నది అందరికీ తెలిసిందే! ప్రజల కోసం ఆనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించినవారిని 1975 జూన్ 25 అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి ఎలాంటి వారెంట్లూ లేకుండా అరెస్టు చేశారన్నది చరిత్ర. కానీ నరేంద్ర మోడీ పదకొండేళ్ల పాలనలోనూ ఇదే తంతు జరుగుతోంది కదా! అప్పుడు వార్తా పత్రికలపై తీవ్రమైన సెన్సార్ అమలయ్యింది. నిరసనగా నల్ల బోర్డర్ తో సంపాదకీయాలు రాసిన పత్రికలెన్నో! ఇప్పుడు కూడా అంతే కదా! కాకపోతే అలా ఎక్కడా సెన్సార్ అని పేర్కొనలేదు కాని ప్రభుత్వానికి ప్రతికూలంగా సమాచారమిచ్చే వార్తా పత్రికలు, టివి చానెళ్లు, చివరికి న్యూస్ పోర్టళ్లను సైతం అమాంతం బడా కార్పొరేట్లు మింగేయడం, 'మోడియా' గా మార్చేయడం చూస్తున్నాం కదా! ఎన్‌డిటివి టేక్ ఓవర్ మొదలు ఇటీవల ది వైర్ న్యూస్ పోర్టల్ బ్లాక్ చేయడం వరకూ ఇదే తంతు కదా! సాంకేతిక విప్లవంతో ముందుకొచ్చిన సోషల్ మీడియా గొంతు నొక్కడంలోనూ మోడీ సర్కారుకు వేరెవరూ సాటి లేరు.

నాటి నేటి నిర్బంధానికి సాక్షి ప్రబీర్

అప్పటి అరెస్టులకు మిసా, డిఐఆర్ వంటి చట్టాలు ప్రాతిపదికలు కాగా ఇప్పుడు దుర్మార్గమైన యుఎపిఎ ఉపయోగించి ఎలాంటి విచారణా లేకుండా ఏళ్ల తరబడి జైళ్లలోనే ఉంచుతున్నారు. వయోవృద్ధుడైన స్టాన్‌స్వామి వంటివారు కారాగారంలోనే కన్ను మూసిన దారుణం మన కళ్లముందు కదులుతుంది. ఇక ఎన్ఐఎ వారు దాడి చేశారంటే ప్రజలు హడలిపోవాల్సిందే. ఏం అడుగుతారో ఏవి సీజ్ చేస్తారో ఎందుకలా చేస్తున్నారో కూడా చెప్పరు. నాటి ఎమర్జెన్సీలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విద్యార్థి నాయకునిగా వున్న ప్రబీర్ పురకాయస్థను అరెస్టు చేయగా మోడీ హయాంలో న్యూస్ క్లిక్ పోర్టల్ సంపాదకునిగా ఆయన్ను అరెస్టు చేశారు. ఆనాడు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న ఇందిరమ్మ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాడని అభియోగం. ఇప్పుడైతే నరేంద్ర మోడీ సర్కారు తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా అన్నదాతలు దేశ రాజధానిలో చేసిన చారిత్రాత్మక పోరాటాన్ని గురించి తన పోర్టల్ ద్వారా ప్రపంచానికి తెలియజేస్తున్నారన్నది కారణం. పత్రికల గొంతు నొక్కడంలో అప్పటిలాగే ఇప్పుడూను. ఆనాడు కుల్‌దీప్ నయ్యర్ కాగా ఇప్పుడు ఉమర్ ఖలీద్ వంటివారెందరో! పౌర హక్కులను, పత్రికా స్వేచ్ఛనూ పాలకుల పదఘట్టనలతో అణిచివేయడంలో తేడా లేదు అనే కన్నా అనేక రెట్లు పెరిగిందని చెప్పవచ్చు.

నాడు బలవంతపు కు.ని., నేడు బుల్డోజర్ రాజ్

నాటి యువజన కాంగ్రెస్ నాయకునిగా సంజయ్ గాంధీ దేశంలో విచక్షణా రహితంగా కుటుంబ నియంత్రణ (కు.ని.) ఆపరేషన్లు చేయించారు. పెళ్లి కానివారికి సైతం కు.ని. ఆపరేషన్లు చేయించారని చెబుతారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు నటించిన యమగోల చిత్రంలో యముడితో సంభాషణలో వ్యంగ్యంగా ఈ అంశాన్ని జోడిస్తే ఆనాడు థియేటర్లలో చప్పట్ల మోత చాలా మందికి ఇప్పటికీ గుర్తుండే ఉంటుంది. ఆనాటి పాలకుల తీరు అలావుండగా ఇప్పుడు ఆరోపణలు ఉన్నాయన్న పేరిట గిట్టనివారివి, ప్రధానంగా మైనార్టీ మతస్తుల ఇళ్లు వాకిళ్లను చిన్న దుకాణాలను సైతం బుల్‌డోజర్లతో నేలమట్టం చెస్తున్న వైనం. ఈ బుల్డోజర్ రాజ్ చెల్లబోదంటూ దేశ సర్వోన్నత న్యాయస్థానమే వ్యాఖ్యానించినా అంతగా వెనక్కు తగ్గని పాలక పార్టీ తీరు చూస్తున్నాం. అందుకు మారుపేరుగావున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పాలనను ఈ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రస్తుతిస్తుండడం గర్హనీయం.

బిజెపి నైతికత ప్రశ్నార్థకం..

అసలు ఎమర్జెన్సీ నిర్బంధాన్ని అనుభవించిన పార్టీగా తనను తాను చెప్పుకొనే నైతిక అర్హత బిజెపి కి వుందా అన్నది పెద్ద ప్రశ్న. బిజెపి అప్పటికి ఏర్పడలేదు. ఆ పార్టీ పూర్వ రూపమైన అఖిల భారతీయ జనసంఘం నాయకులు తొలుత కొందరు అరెస్టయినా ఆ తరువాత లొంగిపోయారు. అంతేగాక వీరందరికీ మూల విరాట్టయిన ఆరెస్సెస్ కు ఆనాటి అగ్రనేత మధుకర్ దత్తాత్రేయ దేవరస్‌తో సహా కొందరు నాయకులు క్షమాభిక్ష పెట్టమని కోరుతూ ప్రధాని ఇందిరా గాంధీకి లేఖలు రాశారు. ఈ విషయాలను ప్రముఖ న్యాయవాది సీనియర్ బిజెపి నేత సుబ్రమణ్య స్వామి, కేంద్ర ప్రభుత్వ ఐబి అధికారి టివి రాజేశ్వర్ వంటివారు తమ గ్రంథాల్లో వెల్లడించారు. భారత జాతీయోద్యమంలో ఎలాంటి పాత్రా లేని ఈ సంఘ్ కుదురు నుండి వచ్చిన బాపతు తాజాగా ఎమర్జెన్సీ వ్యతిరేక వారసత్వాన్ని నెత్తికెత్తుకోవడం ఓ సాహసమే!

నిజానికి ఆనాడు నిర్బంధాన్ని అనుభవించినది, ఎదిరించినదీ జయప్రకాష్ నారాయణ్, మధు దండావతే, రాజ్‌నారాయణ్ వంటి వారు, ఇప్పుడు కనుమరుగైన సోషలిస్టు పార్టీ వంటివి కాగా 1971 నుండి పశ్చిమ బెంగాల్‌లో అర్ధ ఫాసిస్టు నిర్బంధకాండకు, ఎమర్జెన్సీలో దేశమంతటా నాటి పాలకుల లక్ష్యం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు). ఎమర్జెన్సీని ఎదిరించి నిలిచి, ఈనాటికీ అదే నిర్మాణ రూపం కలిగిన జాతీయ పార్టీ అదొక్కటే. కనుక ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట వారసత్వం ముమ్మాటికీ వారిదే! కేంద్రంలో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడడానికి దోహదపడింది సిపిఎం కాగా ఆ ప్రభుత్వాన్ని కూల్చివేసింది ఆరెస్సెస్- జనసంఘ్ వారేనన్నది మరో ముఖ్యమైన విషయం. అలాగే దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఆనాడు, ఈనాడు ప్రజాస్వామ్య ప్రియులనేకమంది పాలకుల నిర్బంధానికి, అణచివేతకూ గురయ్యారు, అవుతున్నారు. అటువంటివారు మాత్రమే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగానూ ఈనాటి అప్రకటిత ఎమర్జెన్సీ నిర్బంధానికి వ్యతిరేకంగా మాట్లాడే పోట్లాడే అర్హత వుంది తప్ప వేరెవరికీ లేదు.

అమరావతి రాజధానిలో హెచ్‌ఓడి, జిఏడి టవర్ల నిర్మాణాలకు ఎల్‌ఓఏ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో చేపడుతున్న ఐకానిక్, హెచ్‌ఓడి, సెక్రటేరియట్ భవన నిర్మాణ సముదాయాలకు సంబంధించి లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్‌ఓఏ)లను కాంట్రాక్టు సంస్థలకు సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు గురువారం అందజేశారు. అమరావతిలోని హెచ్‌ఓడి టవర్లు 1,2 జిప్లస్39 పద్ధతిలో నిర్మించనున్నారు. వీటిని షాపూర్‌జీ పల్లోంజి సంస్థ దక్కించుకుంది. టవర్ 3,4 పనులను ఎల్అండ్‌టికి అప్పగించారు. ఈ భవనాలను కూడా జిప్లస్ 39 పద్ధతిలో నిర్మించనున్నారు. జిఏడి టవర్ నిర్మాణ పనులను ఎన్‌సిసి సంస్థ దక్కించుకుంది. ఆయా సంస్థల ప్రతినిధులకు అవార్డు పత్రాలు అందించిన అనంతరం కమిషన్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమాల ప్రకారం పనులు జరగాలని, కార్మికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు ఇఎన్‌సి గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ పివిఎస్ భాస్కర్, ఎస్‌ఇ అంకమ్మచౌదరి, డిఇఇ హేమాబరధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సికి 91.17 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్సి పరీక్ష 17వ రోజు 91.17 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. టిజిటి (లాంగ్వేజ్), ఇంగ్లీష్, టిజిటి (నాన్ లాంగ్వేజ్, ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 17,383 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసినట్లు డిఎస్సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 78 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన టిజిటి ఇంగ్లీష్ పరీక్షకు 13,062 మంది అభ్యర్థులకు గాను 12099 (92.63శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 39 పరీక్ష కేంద్రాల్లో జరిగిన టిజిటి (నాన్ లాంగ్వేజ్) ఫిజికల్ సైన్స్ పరీక్షకు 6,005 అభ్యర్థులకు గాను 5284 (87.99శాతం) మంది హాజరయ్యారని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ జులై 5న నిరసనలు

- సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ చార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ జులై 5న నిరసనలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. చంద్రబాబు సిఎం అయిన ఏడాది కాలంలో 4 సార్లు విద్యుత్ భారాలను వినియోగదారులపై మోపి, రూ.15,485 కోట్లు అధికంగా వసూలు చేశారని తెలిపారు. అదానీ ఒప్పందంతో దాదాపు రూ.1.10 లక్షల కోట్ల భారం ప్రజలపై పడుతోందని చెప్పారు.

నాడు కాంగ్రెస్‌లో చేరి.. నేడు ఎమర్జెన్సీపై నీతులు

- చంద్రబాబుపై సీదిరి అప్పలరాజు విమర్శలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో ఎమర్జెన్సీ విధించడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అంటూ టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడాన్ని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తీవ్రంగా ఆక్షేపించారు. నాడు ఎమర్జెన్సీకి ముందే చంద్రబాబు కాంగ్రెస్‌లో చేరారని, అప్పట్లో వివాదస్పద నేతగా ఉన్న సంజయ్ గాంధీకి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ నేతల్లో చంద్రబాబు కూడా ఉన్నారని చెప్పారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సీదిరి మీడియాతో మాట్లాడారు. నాడు ఎమర్జెన్సీకి కారణమైన సంజయ్‌కి మద్దతు పలికిన అదే చంద్రబాబు ఇప్పుడు నీతులు చెబుతున్నారని విమర్శించారు. 1975లో యూత్ కాంగ్రెస్‌లో చంద్రబాబు చేరారని, కీలక నాయకుడిగా ఉన్నారని, 2019 ఎన్నికల ముందు కూడా కాంగ్రెస్ పొత్తుపెట్టుకున్నారని తెలిపారు. ఇటీవల జగన్ పర్యటనలో సింగయ్య మరణాన్ని కూటమి ప్రభుత్వం రాజకీయం చేస్తోందన్నారు. గతంలో చంద్రబాబు కాన్వాయ్ వల్ల మృతిచెందిన ఘటనలు ఉన్నాయని, కానీ ఆ కేసుల్లో చంద్రబాబు పేరు ఎందుకు లేదో చెప్పాలని సీదిరి ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ కాన్వాయిలోనూ ఒక వ్యక్తి చనిపోయారని, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే జగన్‌పై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం

- మాదక ద్రవ్యాలను విక్రయిస్తే ఆస్తుల జప్తు
- గుంటూరులో యాంటి నార్కోటిక్స్ డే ర్యాలీలో సిఎం చంద్రబాబు



గుంటూరులో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపట్టిన వాకథాన్‌లో పాల్గొన్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయి, డ్రగ్స్ పూర్తిగా నిర్మూలించే వరకు యుద్ధం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. యాంటి నార్కోటిక్స్ డే సందర్భంగా గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గుంటూరులో చేపట్టిన 'డ్రగ్స్ వద్దు బ్రో' వాకథాన్‌లో ఆయన పాల్గొన్నారు. అమరావతి రోడ్డులోని ఐడి ఆస్పత్రి నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. డ్రగ్స్ వినియోగాన్ని నిషేధించాలన్న ప్లకార్డులు చేతబూని చంద్రబాబుతోపాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందుకు నడిచారు. డ్రగ్స్, గంజాయిలపై ఫిర్యాదులకు వాట్సప్, టోల్ ఫ్రీ నెంబర్లను ఆవిష్కరించారు. సభలో మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో విద్యార్థులు, యువతతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. మాదక ద్రవ్యాలను విక్రయిస్తే ఆస్తుల జప్తు చేస్తామని, ఈ యుద్ధానికి ఎవరైనా అడ్డువస్తే తొక్కుకుంటూ వెళ్తామని హెచ్చరించారు. ప్రజా పోలీసింగ్‌తో గంజాయి, డ్రగ్స్ రహిత రాష్టంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి సెలబ్రిటీలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగంపై వాట్సప్ నెంబరు 8977781972, టోల్ ఫ్రీ నెంబరు 1972కు ప్రజలు సమాచారం ఇవ్వాలన్నారు. యువతను గంజాయి, డ్రగ్స్‌కు బానిస చేసి... సమాజాన్ని పీడిస్తున్న మాఫియాను తరిమేద్దామని ఈ సందర్భంగా చంద్రబాబు పిలుపునిచ్చారు. 'అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుతున్నాం. ప్రపంచంతో పోటీ పడాల్సి ఉన్న తరుణంలో గంజాయి, డ్రగ్స్ నిషేధంపై దృష్టి పెట్టాల్సి వస్తోంది. ఏజెన్సీ ఏరియాలో గంజాయి సాగు చేసే వారికి ప్రత్యామ్నాయాలు చూపించాం. ఇంకా అదే పని చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని' హెచ్చరించారు. టెక్నాలజీతో డ్రోన్లు వినియోగించి నేర నియంత్ర చేస్తున్నామని, సిసిటివి కెమెరాలతో నేరాలు జరగకుండా చూస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ కట్టడిపై దృష్టి పెట్టలేదని అన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రం డ్రగ్స్‌కు నిలయంగా మారిపోయిందని తెలిపారు. విశాఖ కేంద్రంగా గంజాయి రవాణా చేశారని, ఆంధ్రా బ్రాండ్‌ను దెబ్బ తీశారన్నారు. గత ముఖ్యమంత్రి ఒక్కరోజు కూడా మాదక ద్రవ్యాల నియంత్రణపై సమీక్ష చేయలేదని తెలిపారు. తెనాలిలో గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లతో మాజీ సిఎం చెట్టపట్టాలు వేసుకుని తిరుగుతున్నారని, వారిని ప్రోత్సహిస్తున్నారని, పరామర్శిస్తున్నారని తెలిపారు. రాజకీయ ముసుగు వేసుకుంటే దాన్ని తొలగించి కట్టడి చేస్తామని, గంజాయి విక్రయించే వారిని.. వారికి సహకరించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రతిపక్షాలూ ముందుకు రావాలని, ప్రజలకు మంచి చేసి ఓట్లు వేయించుకోవాలని, గంజాయి బ్యాచ్‌ను సపోర్టు చేస్తూ తప్పుడు కార్యక్రమాలు చేయొద్దు." అనిహితవు పలికారు.

పర్యాటక అభివృద్ధికి సహకరిస్తాం

- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో నీటి పారుదల, పర్యాటక రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని కేంద్ర పర్యాటక శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లానింగ్‌తో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. పర్యాటక శాఖ తరపున ఏడు ప్రాజెక్టులకు రాష్ట్రానికి నిధులు వెచ్చించామన్నారు. ఏడాది కాలంలో రూ.450 కోట్లు వివిధ ప్రాజెక్టులకు ఖర్చు చేశామని తెలిపారు. పెహల్గాంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని, మరో 15 రోజుల్లో అక్కడ పర్యాటకుల సందడి మొదలవుతుందన్నారు. ప్రజాస్వామ్యంపై ఎమర్జెన్సీ అతిపెద్ద దాడి అని అన్నారు.

చంద్రబాబుతో భేటీ

రాష్ట్ర పర్యటన సందర్భంగా కేంద్ర మంత్రి షెకావత్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపడుతున్న పలు పర్యాటక ప్రాజెక్టులపై ఇరువురు చర్చించారు. కాగా రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన అనంతరం ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న షెకావత్‌కు రాష్ట్ర ఐటిశాఖ మంత్రి లోకేష్ ఘనస్వాగతం పలికారు. కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భగా తన యువగళం పాదయాత్ర సందర్భంగా పలు విశేషాలతో రూపొందించిన కాఫీటేబుల్ బుక్‌ను షెకావత్‌కు అందజేశారు.

114 సచివాలయాల్లో పోస్టుల పునర్వ్యవస్థీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఉన్న 114 గ్రామ సచివాలయాల్లో జనరల్ పర్పస్, స్పెసిఫిక్ పర్పస్ పోస్టులను పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ ప్రతిపాదనల మేరకు పోస్టులు, ఆయా సచివాలయాల క్లస్టర్లలో మార్పులు చేశారు. అదేవిధంగా కృష్ణా జిల్లా, ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ఆత్కూరు గ్రామాన్ని ప్రత్యేక సచివాలయంగా ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలంలో దొండపాడు, ఉప్పరపాఆలెం, తిమ్మయపాలెం, నడిగడ్డ, చిక్కతీగలపాలెం సచివాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిరంతర 'విద్యుత్' సరఫరాకు చర్యలు

- ఎపిసిపిడిసిఎల్ సమీక్షలో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఎపిసిపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. సిపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సరఫరాపై సచివాలయం నుంచి వర్చువల్‌గా విజయానంద్ గురువారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ స్తంభాల కంటే ఎత్తుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు, జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటివి నివారించేందుకు విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా యోచిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి బృందాలను ఏర్పాటు చేసి జంపర్లు, హంగింగ్ వైర్లు, లో వోల్టేజ్ సమస్యలను వెంటనే గుర్తించి తక్షణం పరిష్కరించి నిరంతర విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు కూడా తీసుకోవాలని ఆదేశించారు. మరమ్మతు పనులు జరిగే సందర్భంలో విద్యుత్‌శాఖతో పాటు వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. సిపిడిసిఎల్ సిఎండి పి పుల్లారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి 9 గంటల పాటు నిరవధిక విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల్లో అధికంగా సరఫరా లోపాలు, వోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ లోపాలే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఏవి భాస్కర్, సిపిడిసిఎల్ డైరెక్టర్లు టివిఎస్ఎన్ మూర్తి, మురళికృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్‌కు వినతిపత్రం అందచేస్తున్న బొత్స, పెద్దిరెడ్డి, అంబటి తదితరులు

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- గవర్నర్‌కు వైసిపి నేతల వినతి
- జగన్‌కు కనీస భద్రత కల్పించడం లేదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ప్రతిపక్ష నాయకుడు జగన్‌పై ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత నేర వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్ మహ్మద్ నజీర్‌కు వైసిపి నేతలు ఫిర్యాదు చేశారు. గురువారం రాజ్‌భవన్లో గరవ్నర్‌ను వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు, అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, పేర్ని నాని, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఎం.అరుణ్‌కుమార్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని చేస్తున్న అరాచకాలను, అఘాయిత్యాలను, జగన్‌కు కల్పించాల్సిన భద్రతను విస్మరించడం వంటి అంశాలపై గరవ్నర్‌కు వివరించామని తెలిపారు.

సత్తెనపల్లి పర్యటనలో వాహనం ఢీకొని సింగయ్య అనే వ్యక్తి చనిపోతే గుంటూరు ఎస్‌పి ప్రమాదానికి వేరొక వాహనం కారణమని తెలిపారని, అనంతరం పోలీసుల తీరు మారిందని తెలిపారు. జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీకొని మరణించారని చెప్పడంతోపాటు కారులో ఉన్న వారందరిపైనా కేసులు నమోదు చేశారని అన్నారు. దేశంలో అత్యంత ప్రజాధరణ కలిగిన నాయకుడు జగనని ఆయనకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఆయన వాహనం చుట్టూ వందల మంది వచ్చి చేరుతున్నారని, పోలీసు భద్రత ఉంటే అంతమంది ఎందుకువచ్చారని ప్రశ్నించారు. పోలీసు ఎస్కార్టు, రోప్ పార్టీ ఎందుకు చూడలేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని అన్నారు. ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా ఇష్టారీతిన మాట్లాడుతున్నారని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎవడి నార తీస్తారు, ఎవడి ముక్కెలు ఇరగదీస్తారో' పవన్ చెప్పాలన్నారు. ఇలాంటి పనికిమాలిన మాటలు మానుకోవాలని సూచించరాఉ. హోంశాఖ మంత్రి అనిత ఒక ఎమ్మెల్యే తరహా భద్రత కల్పించామని చెబుతున్నారని, ఆయన మాజీ ముఖ్యమంత్రి అన్న సంగతిని ఆమె గుర్తుపెట్టుకోవాలన్నారు. జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తాటిపర్తి చంద్రశేఖర్, విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు దేవినేని అవినాష్ పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో ధాన్యం బకాయిలు

- జమచేయాలని కౌలు రైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతుల ఖాతాల్లో ధాన్యం, రవాణా, హమాలి చార్జీలను వెంటనే జమ చేయాలని ఎపి కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. పౌర సరఫరాల శాఖ ఎండి మనజీర్ జిలాని సమూన్‌ను ఆ సంఘం నాయకులు గురువారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. వివిధ జిల్లాల్లోని రైతులకు ధాన్యం బకాయిలు రూ.1000 కోట్లకు పైనే ఉనట్లు తెలుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రబీ పంట ధాన్యం మాసూలైయి రెండు నెలలు గడస్తుందని పేర్కొన్నారు. రవాణా, కాటా, కూలి సంచుల ఖర్చులు కూడా రైతులు, కౌలు రైతులు ముందుగానే చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. గత పంటకు పెట్టుబడి నిమిత్తం తెచ్చిన అప్పులతో పాటు కోత మిషన్లు, ట్రాక్టర్లు, కూలీలు, బరకాలు వంటి ఖర్చులు చెల్లించలేని పరిస్థితుల్లో తిరిగి ఖరీఫ్ పంట ముందుకు రావడంతో కౌలురైతులు, సొంత సాగుదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. దీంతో పాటు పంట చేతికొచ్చాక కూడా తెచ్చిన అప్పులకు నెలలు తరబడి అదనంగా వడ్డీలు కట్టి నష్టపోతున్నారని పేర్కొన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న అప్పు ఏడాదిలోపు చెల్లిస్తే సున్నా వడ్డీ పథకం వర్తించేదని ప్రభుత్వం ఆలస్యం చేయడంతో దీనిని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రైతుల ఖాతాల్లో ధాన్యం బకాయిలతో పాటు రవాణా చార్జీలు, కాటా కూలి సంచుల ఖర్చులు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో నిర్వహించే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎండిని కలిసిన వారిలో కౌలు రైతుల సంఘం రాష్ట్రకార్యదర్శి ఎం హరిబాబు, కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఎన్టీఆర్ జిల్లా నాయకులు కె శ్రీనివాసరెడ్డి, జి హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిపై కేసు

- లక్కిరెడ్డిపల్లె ఎంపిపి సుదర్శన్‌రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డితో సహా 17 మంది వైసిపి నేతలపై లక్కిరెడ్డిపల్లి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి నాయకులు లక్కిరెడ్డిపల్లి మండలం కుర్నూతల గ్రామం అగ్రహారంలో నిర్వహించిన ప్రచారం సందర్భంగా బాణాసంచా పేల్చారు. ఈ క్రమంలో మండ్ల లోకేష్ అనే వ్యక్తి కన్ను కోల్పోయారు. దీంతో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లోకేష్ ఫిర్యాదు చేశారు. ఎన్‌హెచ్ఆర్‌సి ఆదేశాల మేరకు 19 మంది వైసిపి నేతలపై పోలీసులు కేసు నమెదు చేశారు. శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మల్లె రెడ్డయ్య, లోమడ జగన్మోహన్‌రెడ్డి, ఆవలకుంట వెంకటరమణ, దుద్దినకుంట విజయ భాస్కర్‌రెడ్డి, అరవ శివారెడ్డి, దియల సుబ్బయ్య, పోలిరెడ్డి సుబ్బారెడ్డి, కుడుముల కొండారెడ్డి, వాయల్‌పాటి వెంకటరమణ, వేముల శ్రీనివాసులు, అంబాబత్తెన రెడ్డయ్య, మండ్ల సుబ్బరాయుడు, రామ్మోహన్‌రెడ్డి, కె.వెంకటరామిరెడ్డి, లోమడ రామసుబ్బారెడ్డి, మండ్ల నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు లక్కిరెడ్డిపల్లి ఇన్‌ఛార్జి సిఐ వరప్రసాద్, ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నామన్నారు. మిగతా వారి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. సుదర్శన్‌రెడ్డిని విచారిస్తున్నామని వెల్లడించారు.

కొత్తగా 7 అన్నా క్యాంటీన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా 7 అన్నా క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ పరిధిలోని సంబంధిత పట్టణ ప్రాంతాల పరిధిలోకి వచ్చే గ్రామీణ ప్రాంతాలైన కొటబొమ్మాళి, దుగ్గిరాల, శాంతిపురం, గుడిపల్లి, రామకుప్పం, కుప్పం (రూరల్), ఉప్పాడ-కొత్తపల్లి అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. ఇందుకు రూ.4.47 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

ఆదాయం పెంపుపై దృష్టి

- ఆర్థికశాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


రానున్న రోజుల్లో వివిధ పథకాల అమలు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన నిధులపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. అలాగే మూలధన వ్యయానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆర్థికశాఖపై గురువారం ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పింఛన్లతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రతినెలా వెచ్చిస్తున్న ఖర్చుతో పాటు రానున్న రోజుల్లో వివిధ పథకాల అమలుపైనా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. నాబార్డు రుణాల ద్వారా సమీకరించి నిధుల్లో ఎక్కువ భాగం పంచాయతీరాజ్‌శాఖపై ఖర్చు చేయాలని సూచించారు. కేంద్ర కార్యక్రమాల కింద ఇచ్చే నిధులు మూలధన వ్యయానికి ఖర్చు చేయాలని సిఎం అన్నారు. సంక్షేమ పథకాలతోపాటు సంపద సృష్టికి, రెవెన్యూ ఆదాయం పెంచేందుకు అవసరమయ్యే మూలధన వ్యయం మరింత పెంచాలని ఆదేశించారు. ఈ తరహా ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆర్థికశాక మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల కట్టడికి కఠిన చట్టాలు అవసరం

- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సైబర్ నేరాల నుంచి ప్రజలను కాపాడేందుకు బలమైన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని శాసన సభ పిటీషన్ల కమిటీ అభిప్రాయపడుతున్నట్లు చైర్మన్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె రఘురామకృష్ణరాజు తెలిపారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్‌ల వల్ల ఎంతో మంది అమాయకులు మోసపోతున్నారని చెప్పారు. శాసన సభ భవనంలోని తన ఛాంబరులో కమిటీ సభ్యులు కొణతల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, పి విష్ణుకుమార్ రాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లారు. ఈ అంశంపై వచ్చే శాసన సభ సమావేశాల్లో చర్చ జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భీమవరం నుంచి ఈ అంశంపై కమిటీకి ఫిర్యాదు అందిందన్నారు. గత ఏడాది ఒక్క తెలంగాణలో 950 మంది మోసపోయినట్లు అధికారిక నివేదిక వెల్లడిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఎంత మంది ఉన్నారనే విషయం ఖచ్చితంగా తెలియదన్నారు. సైబర్ పోలీసు స్టేషన్ల సంఖ్యను పెంచడంతో పాటు పోలీసులు, ఐటి సాంకేతిక నిపుణులతో పటిష్టమైన నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ విషయాలపై మరింత లోతుగా చర్చజరిపి తగిన చర్యలు తీసుకునే విధంగా వచ్చే నెల 18వ తేదీన జరగనున్న కమిటీ సమావేశానికి ఐటి, హోం శాఖ ఉన్నతాధికారులు హాజరు కావాలని కోరడం జరిగిందని తెలిపారు. కమిటీ సమావేశంలో శాసన సభ సెక్రెటరీ జనరల్ ప్రసన్న కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

చేనేత సహకార సంఘాల బకాయిలు చెల్లించండి

- మంత్రి లోకేష్‌కు చేనేత కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ కింద రూ.156 కోట్లు వెంటనే చెల్లించాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌ను ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు గుంటూరు జిల్లా ఉండవలిల్లో గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. త్రిఫ్ట్‌ఫండ్ రూ.5 కోట్లను సత్వరమే విడుదల చేయాలని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని, సహకార సంఘాలకు 2025 మార్చి నాటికి ఉన్న సిసి మొత్తం రద్దు చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు. చేనేత కార్మికులకు మూడు సెంట్లు స్థలం ఇవ్వడంతోపాటు, మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు ఇవ్వాలని, ప్రయివేట్ రంగంలోని చేనేత కార్మికులకు త్రిఫ్ట్‌ఫండ్ స్కీంను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు అమలు చేయాలని, చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, సహకార సంఘాల అప్పులు రద్దు చేయాలని, ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఇంట్లో మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్, సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.156 కోట్లు, త్రిఫ్ట్‌ఫండ్ రూ.ఐదు కోట్లు వెంటనే విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శివదుర్గారావు, పి.బాలకష్ణ, నాయకులు డి.రామారావు, ఎ.వీరబ్రహ్మం, కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

రాష్ట్రంలో జల రవాణా అభివృద్ధికి కృషి

- మంత్రి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జల రవాణా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఎపి ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆధ్వర్యంలో విజయవాడలో ఒక హోటల్ భాగస్వామ్య పక్షాల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోడ్లు, రైలు మార్గాల కంటే జలరవాణాకు అయ్యే ఖర్చు చాలా తక్కువ అని చెప్పారు. బకింగ్ హమ్ కెనాల్‌కు పూర్వ వైభవం తెస్తామని, త్వరలో ఈ కెనాల్ నుంచి చెన్నైకు సరుకు రవాణాకు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. బందరు కెనాల్, కృష్ణానది రోల్ ఆఫ్, రోల్ ఆన్ కార్గో వంటి ప్రాజెక్టులు సరుకు రవాణా విధానంలో పెను మార్పులు తీసుకొస్తాయన్నారు. రాష్ట్రంలో నదీ కారిడార్లలో 50కిపైగా పారిశ్రామిక క్లస్టర్లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎపి ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జడ్.శివప్రసాద్ తదితరులు ప్రసంగించారు. పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జులై 5న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా అని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో జులై 5న జరగబోయే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం)2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలని సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు విద్యాశాఖ అధికారులకు గురువారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమాజ భాగస్వామ్యంతో ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వారధి పిటిఎం అని తెలిపారు. ఈ కార్యక్రమం ఫలితాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయడానికి వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు.

విశాఖలో 3 నుండి ఎనస్తీషియా వైద్యుల సౌత్‌జోన్ సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విశాఖపట్నంలో జులై 3 నుంచి 6 వరకు ఎనస్తీషియా వైద్యుల 34వ రాష్ట్ర, 40వ సౌత్‌జోన్ (ఎపి, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి) సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజిస్ట్స్ (ఐఎస్ఎ) ఎపి రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 3న వర్క్‌షాపు, 4న సిఎంఇ, 5, 6 తేదీల్లో సదస్సు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి చక్రరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు 1500 మంది ఎనస్తీషియా వైద్యులు, ఇతర రాష్ట్రాల నుండి 150 మంది ఫ్యాకల్టీ హాజరవుతారని పేర్కొన్నారు.

కోదాడలో రోడ్డు ప్రమాదం

- ఆలమూరు ఎస్ఐ, కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు , నరసాపురం


ఎస్ఐ అశోక్


జీవన్ బ్లెస్సన్

తెలంగాణ సూర్యాపేట జిల్లా నల్గొండలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ప్రమాదంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ ఎస్.జీవన్‌బ్లెస్సన్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక కేసులో నిందితులను పట్టుకునేందుకు ఎస్ఐ అశోక్, హెడ్ కానిస్టేబుల్ స్వామి, కానిస్టేబుల్స్ జీవన్, డ్రైవర్ రమేష్ హైదరాబాద్ వెళుతున్నారు. ఈ క్రమంలో కోదాడ మండలం దుర్గాపురం వద్ద ఒక వాహనాన్ని తప్పించే క్రమంలో లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ జీవన్ సంఘటనా స్థలంలోనే మరణించారు. హెడ్ కానిస్టేబుల్, డ్రైవర్‌కు గాయాలు కాగా వారు కోదాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ భౌతికకాయాన్ని పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని 22వ వార్డు రుస్తుంబాదలోని ఆయన స్వగృహానికి తీసుకున్నారు. అనంతరం గోదావరి తీరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కానిస్టేబుల్ జీవన్ ఆలమూరుకు చెందిన వ్యక్తి. అవివాహితుడైన జీవన్‌కు ఇటీవలే కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది.

నిప్పటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఒంటిపై పెట్రోల్ పోసికొని నిప్పటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఏలూరు జిల్లా సబ్ జైలు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు నగరంలోని బీడీ కాలనీకి చెందిన లావేటి సోమేశ్వరరావుకు, మోహనమ్మకు గతేడాది ఆగస్టులో వివాహమైంది. భార్యపై అనుమానంతో ప్రతిరోజు సోమేశ్వరరావు వేధించేవాడు. ఈ క్రమంలో మహిళా పోలీసులకు కొద్ది రోజుల క్రితం తన భర్తపై మోహనమ్మ ఫిర్యాదు చేశారు. సోమేశ్వరరావుపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గురువారం సబ్ జైలు సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

ఆరంభ శూరత్వమేనా..?

- సరిపడా రా మెటీరియల్ లేకుండా
- మూడో బ్లాస్ట్ ఫర్నేస్ పునఃప్రారంభానికి చర్యలు
- నేడు ప్లాంట్‌లో కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి పర్యటన
- 'ఉక్కు'ను నష్టాల్లోకి నెట్టేసేందుకేనని విమర్శలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



సరిపడా రా మెటీరియల్ లేకుండానే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్-3ని పున: ప్రారంభించడానికి ప్లాంట్ యాజమాన్యం సిద్ధమైపోయింది. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బ్లాస్ట్ ఫర్నేస్ - 3ని పున : ప్రారంభించేందుకు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన సంయుక్త కార్యదర్శి దయానిధన్ పాండే శుక్రవారం కర్మాగారానికి రానున్నారు. వాస్తవానికి ఉక్కు శాఖ కార్యదర్శి హాజరుకావాల్సి ఉన్నా ఆయన పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. ప్రస్తుతం ప్లాంట్‌లో వారం రోజులకు సరిపడా రా మెటీరియల్ మాత్రమే ఉన్నట్టు సమాచారం. ఇంత తక్కువ మొత్తంలో ముడి సరుకు ఉన్నప్పటికీ బిఎఫ్ 3ని పున: ప్రారంభించడానికి పూనుకోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఇది ఆరంభ శూరత్వమేనేని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

గతంలో హడావుడి చేసి మూసేశారు

గత ఏడాది సెప్టెంబర్‌లో బిఎఫ్-3ని పున:ప్రారంభించి రా మెటీరియల్ లేక రెండు నెలలకే మూసివేశారు. తగినంత ముడిసరుకును సిద్ధం చేసుకుని ప్రారంభించాల్సి ఉన్నా యాజమాన్యం దుందుడుకుగా ముందుకు వెళ్తోంది. 20 వేల టన్నుల సామర్థ్యంతో నడపాలంటే తొమ్మిది వేల టన్నుల బొగ్గు తక్షణ అవసరం అని తెలుస్తోంది. రా మెటీరియల్ చాలకపోతే కూలింగ్ ప్లేట్లు దెబ్బతింటాయి. ఈ కూలింగ్ ప్లేట్లను విదేశాల నుంచి రెండు నెలల ముందే దిగుమతి చేసుకోవాలి. అలాంటిదేమీ లేకుండానే మళ్లీ యాజమాన్యం హడావుడి చేయడాన్ని చూస్తే కార్మికుల్లో అనుమానాలు కలుగుతున్నాయి. ముడి సరుకు లేక బిఎఫ్ 3ని మరలా మూసేస్తే ప్లాంట్‌పై ఆర్థిక భారం పడుతుందని, ఇదంతా 'ప్రైవేటీకరణ' వ్యూహంలో భాగమేనని పలువురు చెబుతున్నారు. 'మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపేందుకు అవసరమైన రా మెటీరియల్ ఉండాలి. అలా లేకుండా బిఎఫ్-3ను ప్రారంభించం. యాజమాన్యం ఎలాంటి చొరవ దీనిపై చేయరాదు. మూడు నెలలకు సరిపడా రా మెటీరియల్ (ముడిసరుకు) దగ్గరుంటేనే మూడో ఫర్నేస్‌ను ప్రారంభించాలి' అని గతంలో ప్లాంట్‌లో ఉక్కు కేంద్ర సహాయ కార్యదర్శి పాండ్రిక్ పర్యటించిన సందర్భంగా హెచ్చరించారు. కానీ శుక్రవారం మధ్యాహ్నం బిఎఫ్ -3ని ప్రారంభించే చర్యలను ఉక్కు యాజమాన్యం చేపట్టింది.

3,4,5 తరగతులను తరలించొద్దు

- మంత్రి లోకేష్‌కు ఐద్వా లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను తరలించొద్దని ఐద్వా రాష్ట్రకమిటీ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆ సంఘం కార్యదర్శి డి రమాదేవి గురువారం లేఖ రాశారు. తరగతుల విలీనాన్ని అశాస్త్రీయంగా చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కంటే మంచి పరిపాలన అందిస్తామన్న వాగ్దానాన్ని ప్రజలు విశ్వసించి భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. కానీ గతాన్ని కంటే పాఠశాల విద్య మరింత అస్తవ్యస్తమయ్యిందని విమర్శించారు..పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని మాదల గ్రామంలోని దళితవాడ పాఠశాలలో గతేడాది 27 మంది పిల్లలుండేవారని పేర్కొన్నారు. ఈ ఏడాది 3,4,5 తరగతులను అక్కడి నుంచి తరలించడంతో 8 మందే ఉన్నారని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం సూర్యారావుపేటలోని పాఠశాలలో కూడా తరగతులను తరలిస్తున్నారని తెలిపారు. పిల్లలు ట్రాఫిక్‌లో రాష్ట్ర రహదారిపై పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదని, ఇక్కడే చదువుకునేలా మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరుతున్నారని వెల్లడించారు. తల్లిదండ్రుల మాటలు వినడంతో పాటు ఉపాధ్యాయులు చెప్పేది ఆలకిస్తేనే మెరుగైన విద్యకు సహకరించినవారవుతారని మంత్రికి సూచించారు. లేదంటే గత పాలన కంటే చెడ్డపాలనగా ప్రజలు మిమ్మల్ని భావించే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. తల్లుల ఆవేదనను, పిల్లల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ఆ పాఠశాలల పిల్లలు తిరిగి అక్కడ చదువుకునే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ లేఖతో పాటు పెనుమంట్ర గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాల ఉపాధ్యాయులకు రాసిన పిటిషన్‌ను జతపరిచారు.

142 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు


రాష్ట్రంలో 2025-26 పంట కాలానికి అంతర్జాతీయ డిమాండ్, రైతు సాగుబడికి ఆమోదయోగ్యమైన పరిధికి అనుగుణంగా 142 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి పరిమాణాన్ని టుబాకో బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు బోర్డు చైర్మన్ సిహెచ్.యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన గుంటూరులోని టుబాకో బోర్డు ప్రధాన కార్యాలయంలో గురువారం 165వ పొగాకు బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

రైతులు నిర్ధారించిన పంట పరిమాణానికి లోబడి పంట పండించి మెరుగైన ధరలు పొందాలని సూచించారు. సమావేశంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, ఆక్షన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బి.బ్రహ్మయ్య, సభ్యులు జిసి విక్రమ్‌రాజ్, గుత్తా వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- నౌపడ (శ్రీకాకుళం జిల్లా)

సముద్రంలో చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా అలల తాకిడికి బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో మత్స్యకారుడు మృతి చెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం గొలుగువానిపేటకు చెందిన మత్స్యకారులు గొర్లి రామారావు (39), గొర్లి రామారావు, గొర్లి రామ్, గొర్లి సింహాచలం, గొర్లి పోతయ్య, గొర్లి రామయ్య గురువారం వేకువజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా తీరం సమీపంలో అలల ధాటికి బోటు ఒక్కసారిగా తిరగబడింది. బోటులో ఉన్న మత్స్యకారుల్లో నలుగురు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. రామారావు ఒడ్డుకు చేరుకోకపోవడంతో స్థానిక మత్స్యకారులు సముద్రంలో గాలించినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నానికి రామారావు మృతదేహం ఒడ్డుకు చేరింది. సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం, తహశీల్దార్ హేమసుందరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య తులశమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

దుర్గమ్మకు ఆషాఢం సారె

- సమర్పించిన హోం మంత్రి
- ఇంద్రకీలాద్రిపై వారాహి నవ రాత్రులు ప్రారంభం

ప్రజాశక్తి- విజయవాడ సిటీ

విజయవాడ శ్రీ కనక దుర్గమ్మకు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత గురువారం ఆషాఢం సారె సమర్పించారు. తొలుత దుర్గమ్మను దర్శనం చేసుకున్న అనంతరం మంత్రి సారె సమర్పించారు. ఆమెకు ఆలయ ఇఒ వి.కె.శీనా నాయక్ స్వాగతం పలికారు. విశ్వావసు నామ సంవత్సర ఆషాఢమాసం ప్రారంభం సందర్భంగా ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రధాన ఆలయం నుండి మహామండపం 6వ అంతస్తులోకి ఊరేగింపుగా తీసుకొవచ్చారు. దేవస్థానం సిబ్బంది తరుఫున ఆలయ కార్యనిర్వహణాధికారి శీనానాయక్ దంపతులు సారె సమర్పించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. అలాగే ఇంద్రకీలాద్రిపై విశ్వావసు నామ సంవత్సర వారాహి నవరాత్రులు గురువారం ప్రారంభమయ్యాయి. జూలై 4 వరకు తొమ్మిది రోజులపాటు ఈ గుప్త నవరాత్రులు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవాలయ అధికారులు పాల్గొన్నారు.


హార్సిలీహిల్స్‌ను పరిశీలిస్తున్న రాందేవ్‌బాబా

హార్సిలీహిల్స్‌లో వెల్నెస్ సెంటర్‌కు కృషి

- రాందేవ్ బాబా

ప్రజాశక్తి-బి.కొత్తకోట, మదనపల్లె అర్బన్

హార్సిలీహిల్స్‌లో అంతర్జాతీయ స్థాయి వెల్నెస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని రాందేవ్‌బాబా అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఆయన పర్యటించారు. హార్సిలీకొండపై పరిసర ప్రాంతాలన్నీ పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... గొప్పచరిత్ర కలిగిన హార్సిలీహిల్స్‌లో సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రాలను ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో కాకుండా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజలంతా యోగాను జీవన ప్రక్రియలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, మండల అధికారులు, పర్యాటకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాందేవ్‌కు కట్టబెడితే పోరాటం : సిపిఎం

హార్సిలీహిల్స్‌ను రాందేవ్‌బాబాకు కట్టబెడితే చూస్తూ ఊరుకునేది లేదని, పోరాటం తప్పదని సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. ఏ అధికారిక హోదా లేని వ్యక్తికి అధికారులు స్వాగతం పలకడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో హార్సిలీహిల్స్‌ని వైసిపి ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వ పెద్దలు పతంజలి కార్పొరేట్ సంస్థకు అప్పగించడానికి అర్రులు చాచడం సిగ్గుచేటన్నారు.


అఖండ గోదావరి ప్రాజెక్టు ప్రారంభం

- పాల్గొన్న కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్
- రూ. 430 కోట్లతో ఏడు టూరిజం ప్రాజెక్టులు : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి


సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు గురువారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టే ఈ అఖండ గోదావరి ప్రాజెక్టులో రూ. 94.44 కోట్లతో రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు, 127 ఏళ్ల చరిత్ర ఉన్న హేవలాక్ వంతెన రూపురేఖలు మార్చడంతో పాటు గోదావరి మధ్యలో 116.97 ఎకరాల్లో బ్రిడ్జిలంక (హేవలాక్ వంతెన, రోడ్‌కం రైల్వే బ్రిడ్జి మధ్య ప్రాంతం), కడియం నర్సరీలును అభివృద్ధి చేయనున్నారు. 2027 ఆగస్టులో నిర్వహించే పుష్కరాల నాటికి ఈ పనులు పూర్తి కానున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి దాదాపు రూ.450 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. స్వదేశీ దర్శన్ ప్రసాద్, శాస్కి, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ తదితర స్కీమ్‌ల ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం దోహదం చేస్తోందని తెలిపారు. స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా అరకు, బొర్రా గుహలు, లంబసింగి, సూర్యలంక బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అమరావతి, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం దేవాలయాల్లో యాత్రికులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అఖండ గోదావరి ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 94.44 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. రాజమహేంద్రవరం అనగానే గోదావరి తీరం, తీరం వెంబడి నాగరికత గుర్తుకు వస్తాయన్నారు. దాదాపు రూ.430 కోట్లతో ఏడు టూరిజం ప్రాజెక్టుల పనులు ఈరోజు ప్రారంభిస్తున్నామని, వీటిల్లో కొన్నింటికి ప్రణాళికలు పూర్తి కాగా మరికొన్ని పనులు పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు పూర్తయితే 800 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. రూ.94.44 కోట్ల అంచనా వ్యయంతో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం శుభ పరిణామం అన్నారు. ఎంపి పురందేశ్వరి మాట్లాడుతూ...చారిత్రక ప్రాధాన్యత గుర్తించి అభివృద్ధి చేసేందుకు కేంద్రం సాయమందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.



భారత్‌లో సంపన్నులు 55 శాతం పెరగొచ్చు

- ప్రపంచ సగటు కంటే రెట్టింపు
- బిసిజి రిపోర్ట్

ముంబయి : భారత్‌లో ఓ వైపున పేదలు, మధ్య తరగతి ప్రజల ఆదాయాల్లో పెద్ద పురోగతి లేకపోగ.. అధిక ధరలతో ఉన్న ఆదాయాలు తరిగిపోతున్నాయి. మరోవైపు ధనవంతులు మరింత సంపన్నులు అవుతున్నారు. ఐదేళ్లలో దేశంలో సంపన్నులు రెట్టింపు కానున్నారని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బిసిజి) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ వివరాలు.. 2024-2029 మధ్య భారత్‌లో సంపన్నుల జనాభా 55 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా. ఇది ప్రపంచ సగటు 21 శాతంతో పోల్చితే రెట్టింపు కావడం విశేషం. 2023, 2024లో భారత ఆర్థిక సంపద 10.8 శాతం పెరిగింది. ఆసియా-పసిఫిక్ సగటు 7.3 శాతంగా ఉంది. ఉత్తర అమెరికాలో సంపద పెరుగుదల 4 శాతం, పశ్చిమ ఐరోపా 5 శాతం చొప్పున నమోదయ్యింది. కాగా 2029 నాటికి ఆసియా-పసిఫిక్ ప్రాంతం వార్షిక సంపద పెరుగుదల 9 శాతంగా ఉండొచ్చు.

"2024 నుంచి 2029 వరకు డాలర్ మిలియనీర్ల సంఖ్య 55 శాతానికి పైగా పెరగొచ్చని అంచనా. ముఖ్యంగా యువ పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ లీడర్లు పరిశ్రమను కొత్త పుంతలు తొక్కించనున్నారు. బలమైన ఈక్విటీ మార్కెట్ పనితీరు కారణంగా ఆర్థిక ఆస్తులు 8.1 శాతం పెరగడంతో 2024లో ఆర్థిక సంపద రికార్డు స్థాయిలో 305 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది." అని బిసిజి మేనేజింగ్ డైరెక్టర్, పార్ట్నర్ మయాంక్ ఝా తెలిపారు.

సెన్సెక్స్ 1000 పాయింట్లు ర్యాలీ

ముంబయి : ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో భారత స్టాక్ మార్కెట్లు పరుగులు పెట్టాయి. పశ్చిమాసియాలో పరిస్థితులు సానుకూల స్థాయికి చేరుకోనున్నాయనే అంచనాలతో ముడి చమురు ధరలు తగ్గాయి. ఈ నేపథ్యంలో లోహ, ఫైనాన్షియల్ సర్వీసెస్ స్టాక్స్‌లో ప్రధానంగా కొనుగోళ్లు జరగడంతో గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 1000 పాయింట్లు లేదా 1.21 శాతం పెరిగి 83,756కు చేరింది. ఇంట్రాడేలో ఏకంగా 83,812 పాయింట్లను తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 304 పాయింట్లు లేదా 1.21 శాతం లాభపడి 25,549 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఎటర్నల్ షేర్లు అధికంగా లాభపడగా.. ఎస్‌బిఐ, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాలు చవి చూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.81 డాలర్ల వద్ద నమోదయ్యింది.

ఫోన్‌పే, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు ఆవిష్కరణ

హైదరాబాద్ : హెచ్‌డిఎఫ్‌సి భాగస్వామ్యంతో ఫోన్‌పే కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డును ఆవిష్కరించింది. దీంతో ముఖ్యంగా ఫోన్‌పే ప్లాట్‌ఫామ్‌లో యుపిఐ పేమెంట్లు చేసే యూజర్లకు ప్రయోజనాలు అందించేలా తీర్చిదిద్దినట్లు ఆ సంస్థ పేర్కొంది. అల్టిమో, యునో వేరియంట్లలో వచ్చిన ఈ కార్డులు రీఛార్జ్, బిల్లు పేమెంట్లు, ప్రయాణం, ఆన్‌లైన్ షాపింగ్, కిరాణా సామగ్రి, క్యాబ్‌లు వంటి ప్రముఖ కేటగిరీల్లో చేసే పేమెంట్లపై రివార్డ్‌లను అందిస్తాయని ఫోన్‌పే ప్రతినిధి సోనిక చంద్ర తెలిపారు.

భారీ బ్యాటరీతో పోకో ఎఫ్7 విడుదల



ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ టెక్నాలజీ బ్రాండ్లలో ఒక్కటైన పోకో తన ఎఫ్-సిరీస్‌లో భారీ బ్యాటరీ సామర్థ్యంతో కొత్తగా పోకో ఎఫ్7 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. గురువారం హైదరాబాద్‌లో దీనిని పోకో ప్రొడక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సచిన్ దేవ్ ఆవిష్కరించారు. ఈ ఫోన్‌ను 7550 ఎంఎహెచ్ బ్యాటరీతో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులో ప్రధానంగా సోనీ 50ఎంపి కెమెరాను అమర్చామన్నారు. 12జిబి ర్యామ్, 256 మెమోరీ వేరియంట్ ధరను రూ.29,999గా, 12జిబి, 512 జిబి ధరను రూ.31,999గా నిర్ణయించామన్నారు. జులై 1న ఫ్లిప్‌కార్ట్‌లో సేల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

సామ్‌సంగ్ నుంచి బెస్పోక్ ఎఐ ఉత్పత్తులు

న్యూఢిల్లీ : ప్రముఖ గృహోపకరణాల ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా 2025 బెస్పోక్ ఎఐ ఆధారిత రిఫ్రిజరేటర్లు, ఎఐ లాండ్రీ కొంబో వాషింగ్ మిషన్లు, ఎసి ఉపకరణాలను విడుదల చేసినట్లు వెల్లడించింది. వీటి ఆవిష్కరణలో సామ్‌సంగ్ ఇండియా డిజిటల్ ఉపకరణాల వ్యాపారం వైస్ ప్రెసిడెంట్ ఘుఫ్రాన్ ఆలం, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ జాన్ ఎస్ డబ్ల్యు పార్క్, సామ్‌సంగ్ సౌత్ వెస్ట్ ఆసియా అధ్యక్షుడు జెబి పార్క్ పాల్గొన్నారు. వీటిని వాయిస్ ఆదేశాలను ఉపయోగించి నియంత్రించవచ్చని తెలిపింది.



బజాజ్ ఫిన్ సర్వ్ 'స్మాల్ క్యాప్ ఫండ్' ప్రారంభం

ముంబయి : బజాజ్ ఫిన్ సర్వ్ ఎఎంసి కొత్తగా స్మాల్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. క్వాలిటీ, విలువ, వృద్ధి తరహా 3-ఇన్-1 అడ్వాంటేజ్‌తో దీన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ ఫండ్ జూన్ 27ను తెరువబడుతుందని.. జూలై 11న ముగుస్తుందని పేర్కొంది. ఇందులో కనీస పెట్టుబడిని రూ.500గా నిర్ణయించింది.

స్మార్ట్‌వాచ్‌తోనూ చెల్లింపులు

- బోట్, మాస్టర్‌కార్డ్‌తో యాక్సిస్ బ్యాంక్ జట్టు

న్యూఢిల్లీ : స్మార్ట్‌వాచ్‌తోనూ డిజిటల్ చెల్లింపులు జరిపేలా బోట్, మాస్టర్ కార్డ్‌తో జత కట్టినట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. కొత్తగా ప్రవేశపెట్టిన అధునాతన స్మార్ట్‌వాచ్ 'వేవ్ ఫార్చ్యూన్'తో నిరాటంకంగా ట్యాప్ అండ్ పే ఎన్ఎఫ్‌సి ఆధారిత చెల్లింపులు జరపొచ్చని తెలిపింది. దీన్ని ప్రత్యేక ఆఫర్ కింద రూ.2,599కే అందిస్తున్నట్లు వెల్లడించింది. "కస్టమర్లకు వినూత్నమైన, సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అందించేందుకు యాక్సిస్ బ్యాంక్ ఎల్లప్పుడూ ఆవిష్కరణల ఆధారిత భాగస్వామ్యాలను కుదుర్చుకోవడంపై దృష్టి పెడుతుంటుంది." అని ఆ బ్యాంక్ ప్రతినిధి ఆర్చికా దీక్షిత్ పేర్కొన్నారు.

సంపాదకీయం

వైజ్ఞానిక పథంలో ...

నాలుగు దశాబ్దాల తరువాత మరొక భారతీయ వ్యోమగామి శభాంశు శుక్లా అంతరిక్షంలో అడుగు పెట్టడం దేశానికి గర్వకారణం. భూమికి నాలుగొందల కిలోమీటర్ల దూరంలో ఉన్న అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో మువ్వన్నెల పతాకాన్ని ప్రదర్శించటం భారతీయులందరికీ సంతోషకరమైన అనుభూతి! భారత కాలమానం ప్రకారం ... అమెరికాలోని ఫ్లోరిడా కెన్నడీ అంతరిక్ష పరిశోధనాకేంద్రం నుంచి బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు బయల్దేరిన వ్యోమనౌక గ్రేస్ ... 28 గంటల పాటు ప్రయాణించి, గురువారం సాయంత్రం 4.30 గంటలకు అంతరిక్ష పరిశోధనాకేంద్రానికి విజయవంతంగా చేరింది. ఆ దృశ్యాలను దేశం టీవీల్లో ఆనందోత్సాహాలతో వీక్షించింది. అభివృద్ధి చెందిన దేశాల నుంచి వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లటం, రావటం ఇటీవలి కాలంలో సర్వ సాధారణ విషయమే అయినప్పటికీ– 1984లో రాకేశ్ శర్మ తరువాత మరొక భారతీయ పౌరుడు రోదసీ యాత్ర చేయడం ఇదే ప్రథమం. నాలుగు దేశాల అంతరిక్ష పరిశోధనా కేంద్రాలు సంయుక్తంగా తలపెట్టిన ఈ అంతరిక్ష అధ్యయన యాత్ర మానవాళి వైజ్ఞానిక పథంలో మరొక ముందడుగు.

నాటి సోవియట్ రష్యా సహకారంతో 1984 ఏప్రిల్ మూడో తేదీన అంతరిక్షంలోకి వెళ్లిన రాకేశ్ శర్మ రోదసీలో అడుగిడిన మొట్టమొదటి భారతీయ వ్యోమగామిగా చరిత్రలో నిలిచాడు. రష్యాకు చెందిన ఇద్దరు వ్యోమగాములు, రాకేశ్ శర్మ బృందం అంతరిక్షంలో ఏడు రోజుల 21.40 గంటల పాటు గడిపింది. బయో మెడిసిన్, రిమోట్ సెన్సింగ్ తదితర రంగాల్లో 43 రకాల పరిశోధనలు చేసింది. వాతావరణం లేని రోదసీలో మందుల పనివిధానం ఎలా ఉంటుందో సాగించిన ప్రయోగం తరువాతి కాలంలో వ్యోమగాముల ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మరింత స్పష్టపరిచింది. ఒక భారతీయుడు రోదసీలో తొలి అడుగు వేయటానికి నాటి సోవియట్ సోషలిస్టు రష్యా అందించిన సహకారం చాలా గొప్పది. మనదేశం నుంచి రాకేశ్ శర్మ ఎంపికయ్యాక యూరీ గగారిన్ స్పేస్ సెంటర్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. దిగ్విజయంగా యాత్రను ముగించాక– రాకేశ్ శర్మను కూడా తన వ్యోమగాముల స్థాయిలోనే గుర్తించి, యుఎస్ఎస్ఆర్ హీరో పురస్కారంతో గౌరవించింది. భారతదేశం కూడా రష్యన్ వ్యోమగాములు యూరీ మాలిషెవ్, గెన్నాడీ స్ట్రోకలోవ్ లు ఇద్దరికీ అశోకచక్ర పురస్కారం అందించింది. రెండు దేశాల మధ్య గొప్ప సుహృద్భావం పతాక స్థాయిలో ప్రదర్శితమైన సందర్భం అది. దానికి ముందూ, ఆ తరువాత కూడా అంతరిక్ష పరిశోధనల్లో రష్యా మన దేశానికి గొప్ప శాస్త్ర, సాంకేతిక సహకారం అందించింది.

తాజా రోదసీ అధ్యయనం అమెరికా నేతృత్వాన పోలండ్, హంగేరీ, ఇండియాల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం నలుగురు వ్యోమగాముల బృందంతో సాగుతోంది. అంతరిక్ష కేంద్రంలో ఉండి, 14 రోజుల పాటు బృందం పరిశోధనలు నిర్వహిస్తుంది. మొత్తం 60 అంశాలపై పరిశోధనలు చేయాలని నిర్ణయించగా, ఇందులో మన ఇస్రో ప్రతిపాదించిన అంశాలు తొమ్మిది ఉన్నాయి. దీర్ఘకాలం పాటు చేపట్టే రోదసి యాత్రల్లో వ్యోమగాముల శారీరక మార్పులపై ఈ బృందం పరిశోధిస్తుంది. అంతరిక్షంలో ఉన్నప్పుడు కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగ నిరోధక వ్యవస్థపై కలిగే ప్రభావం గురించి అధ్యయనం చేస్తుంది. ఈ పరిశోధనల ద్వారా చేసే నిర్ధారణలు అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవటానికి, అధిగమించటానికి దోహదపడతాయి. నూతన ఆవిష్కరణలు చేయటానికి ప్రేరణ కలిగిస్తాయి.

అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనాకేంద్రం 90 నిమిషాలకొకసారి భూమి చుట్టూ తిరుగుతూ ఉన్నప్పుడు– అక్కడి నుంచి భూమి ఒక రంగుల బంతి వలె గోచరిస్తుంది. అన్ని దేశాలకూ, అన్ని దేశాల ప్రజలకూ ఆవాసంగా ఉన్న భూగోళం... 'ఎల్ల లోకము ఒక్క ఇల్లై ...' సాగాలన్న మహాకవి గురజాడ మాటలకు గుర్తుగా కనపడుతుంది. శుభాంశు శుక్లా అంతరిక్షంలోకెళ్లినప్పుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించినట్టు ... 'ప్రపంచమంతా ఒక్కటే అన్న వసుధైక భావన'కు శాస్త్రవిజ్ఞానం సహాయకారి కావాలి! సైన్సును ఇరుకు భావాల్లోకి ఇరికించకుండా; వ్యాపార, ఆధిపత్య అవసరాలకు సాధనంగా వాడకుండా ఉండే విశాల హృదయాన్ని ప్రపంచం సాధించాలి. పెట్టుబడుల కట్టుబడితో నిర్మించని సమతా సమాజాలతోనే అలాంటి స్వప్నం సాకారం అవుతుంది!

స్మృతి

నేడు హెలెన్ కెల్లర్ 145వ జయంతి




జీవితంలో ఆనందాన్ని అందించే ఒక తలుపు మూసుకుంటే.. మరో తలుపు తెరుచుకుంటుంది. కానీ మనం మాత్రం ఆ మూసిన తలుపు వైపే చూస్తూ.. మన కోసం తెరచిన తలుపును చూడకుండా వదిలేస్తాం

నిరంతర యుద్ధం - మోడీ కొత్త సిద్ధాంతం

విశ్లేషణ




ప్రకాశ్ కరత్

> **ఆపరేషన్ సిందూర్‌ను తన పాక్షిక, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి నిస్సిగ్గుగా వాడుకుంటున్న తీరుగానీ, మన సైనిక బలగాలకు బదులుగా ఆపరేషన్ ఖ్యాతి అంతా తనదే అన్నట్లు మోడీ వ్యవహరిస్తున్న తీరుగాని చూస్తే...ఉగ్రవాద వ్యతిరేక పోరాటం పేరిట మోడీ, బిజెపిలు దేశంలో ఉన్మాదం రెచ్చగొట్టడానికి, అన్య మతస్తులను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడుతూ...హిందూ ఓటు బ్యాంకును సంఘటితం చేసుకోవాలనే రాజకీయ లక్షాన్ని నెరవేర్చుకోవడానికి చూస్తున్నాయన్న అనుమానాలు నానాటికీ బలపడుతున్నాయి.**

ఆపరేషన్ సిందూర్ ముగిసిన తరువాత మే 12వ తేదీన ప్రధాని మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ మూడు మార్గదర్శకాలతో కూడిన కొత్త సిద్ధాంతాన్ని ప్రకటించారు. దేశ భద్రతకు సంబంధించి అనుసరించబోయే విధివిధానాలు, వ్యూహాల మీద గాఢమైన ప్రభావం చూపించనున్న ఈ కొత్త సిద్ధాంతాన్ని మనం సమగ్రంగా విశ్లేషించి అర్థం చేసుకోవాలి.

మోడీ ప్రవచించిన మూడు మార్గదర్శకాల్లో **మొదటి అంశం**– భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద దాడి జరిగినా అందుకు ధీటుగా బదులిస్తాం. ఉగ్రవాదం మూలాలున్న ప్రతి ప్రాంతం మీదా ప్రతీకార చర్యలు చేపడతాం.

రెండవ అంశం–అణ్వాయుధ దాడి పేరిట బ్లాక్ మెయిలింగ్‌కి పాల్పడితే భారతదేశం ఎంత మాత్రం సహించదు. ఈ సాకున రక్షణ కల్పిస్తున్న ఉగ్రవాదుల రహస్య స్థావరాల మీద ఖచ్చితత్వంతో కూడిన నిర్ణయాత్మక దాడులు చేస్తాం.

మూడవ అంశం–ఉగ్రవాద చర్యల వెనుక ఉన్న పెద్ద తలకాయలకు, ఉగ్రవాదాన్ని ప్రాయోజితం చేస్తున్న ప్రభుత్వానికి మధ్యన ఎలాంటి తేడా లేదని భారతదేశం పరిగణిస్తుంది.

ఈ అంశాలను ప్రస్తావించడానికన్నా ముందు–'మే 10వ తేదీ మధ్యాహ్నం నాటికి మనం ఉగ్రవాద మౌళిక సౌకర్యాల వ్యవస్థను పెద్ద ఎత్తున ధ్వంసం చేశాం. ఉగ్రవాదులను ఏరిపారేశాం. పాకిస్తాన్ నడిబొడ్డున నెలకొల్పిన ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశాం. తదనంతరం పాకిస్తాన్ ప్రభుత్వం ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడబోం, అలానే సైనిక చర్యకు పాల్పడే ఆలోచన చెయ్యం–అని చెప్పుకొచ్చాక మన దేశం ఈ మాటలను మన్నించింది (సైనిక చర్యను విరమించింది).' అని మోడీ చెప్పుకొచ్చారు. దీనికి ముక్తాయింపుగా 'పాకిస్తాన్ ఉగ్రవాద, సైనిక స్థావరాల మీద ప్రతీకార దాడులను తాత్కాలికంగా నిలుపుదల చేశాం' అని మోడీ వివరించారు.

కాళ్లూచేతులూ కట్టేసినట్టు...

ప్రతి ఉగ్రవాద చర్యకు ప్రతీకార దాడులతో బదులు ఇస్తామని ప్రకటించడమంటే ఉగ్రవాద సమస్య పరిష్కారానికి ఎంచుకోవాల్సిన అనేక మార్గాలను మనంతట మనమే మూసేసుకున్నట్లే. మన దేశ వ్యూహాత్మక ప్రతిస్పందనను గుప్పెడు ఉగ్రవాదుల మూక చేతులకు అప్పగించినట్లే. ఇదే మన దేశం ఎంచుకున్న విధానమైతే ఏ ఉగ్రవాదుల గుంపయినా ఉగ్రవాద చర్యకు పాల్పడి పాకిస్తాన్‌తో సైనిక ఘర్షణను ప్రేరేపించడానికి మన దేశాన్ని ఉచ్చులోకి లాగే అవకాశం ఉంటుంది.

మోడీ ప్రకటనలోని సారాంశాన్ని విశ్లేషిస్తూ ప్రముఖ భద్రతా వ్యవహారాల నిపుణుడు అజయ్ సాహ్ని 'ఫ్రంట్‌లైన్' పత్రిక (2025 మే 25 సంచిక)లో ఒక వ్యాసం రాశారు. 'భారత గడ్డ మీద భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద దాడి జరిగినా దానిని యుద్ధ చర్యగా పరిగణిస్తాం' అని ప్రకటించడమంటే 'ఆపరేషన్ సిందూర్' వంటివి సర్వసాధారణంగా మారిపోతాయి. 'ఫలానా స్థాయి' అన్న అంచనా లేకుండా ప్రతి ఉగ్రవాద చర్యకి వ్యతిరేకంగా మన దేశం సైనిక చర్యకు పాల్పడేలా ప్రేరేపించే ఉచ్చులో చిక్కుకు పోతాం' అని అజయ్ సాహ్ని హెచ్చరించారు.

'ఆపరేషన్ సిందూర్'ను హఠాత్తుగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత ప్రధాని మోడీ బిజెపి తరపున చేపట్టిన రాజకీయ ప్రచార సభలన్నింటా 'అపరేషన్ సిందూర్' పూర్తయినట్లు కాదు. తాత్కాలికంగా అపాం' అని ప్రసంగించారు.

ఇక్కడో ప్రశ్న తలెత్తుతుంది. జాతినుద్దేశించి ప్రసంగించే క్రమంలో మోడీ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను, ఉగ్రవాదుల మౌలిక సౌకర్యాలను ధ్వంసం చేశామని ప్రకటించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అవే చిలుక పలుకులు పలికారు. ఆపరేషన్ సిందూర్ అనుకున్న లక్ష్యాలు సాధించడంలో విజయం సాధించిందని మోడీ చేసిన ప్రకటన వాస్తవమైతే భవిష్యత్తులో కూడా ఇలానే సైనిక దాడులకు పాల్పడతాం అని హెచ్చరించడంలో అర్థం ఏముంది! ఇదంతా ముగింపు లేని యుద్ధ వాతావరణాన్ని సృష్టించడానికి దారితీయదా? భద్రతా వ్యవహారాల విషయంలో మనం ఒక మూసకట్టు వ్యూహంలోకి జారిపోవడం సరైనదేనా?

ఇదంతా చూస్తుంటే పైపై ఆర్భాటమే తప్ప వాస్తవం కాదనిపించడం లేదూ. మోడీ పరిపాలనలో ఇలాంటి ఆర్భాటపు ప్రచారాలకు, ప్రకటనలకు కొదవలేదనుకోండి. ఉగ్రవాదుల స్థావరాలన్నీ ధ్వంసం చేశాం, వంద మంది ఉగ్రవాదులను తుద ముట్టించాం అంటూ మోడీ చేసిన ప్రకటన చూస్తుంటే ప్రజల ముందు గొప్పలు చెప్పుకోవడానికేనేమో అన్న అనుమానం తలెత్తుతున్నది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన దాడి తర్వాత ప్రభుత్వం తరపున అధికారికంగా మాట్లాడిన నాయకులందరూ దాయాది దేశం మీద ఈసారి మనం చేపట్టబోయే సైనిక చర్య బాలాకోట్ సర్జికల్ దాడులకు మించిన స్థాయిలో ఉంటుందని ప్రకటిస్తూ వచ్చాయని రక్షణ వ్యవహారాల నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఆ తర్వాత రెండు వారాలకు ప్రభుత్వం సైనిక చర్య చేపట్టింది. ముందు నుండీ దాడులు చేస్తాం అని భారత ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల దృష్ట్యా ఉగ్రవాద శక్తులు తప్పించుకునే మార్గం చూసుకోకుండా భారత ప్రభుత్వం చేసే దాడుల్లో హతమైపోదామని నిర్ణయించుకుని అవే తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను అంటిపెట్టుకుని ఉన్నారని మనం భావించాలా? శత్రువు దాడి చేస్తాడన్న సమాచారం ముందుగానే అందాక ఎవరన్నా ఉన్నచోటే శిలేసుకు కూర్చుంటారా? ఉండరు కదా! కాబట్టి మోడీ ప్రభుత్వం చేసే ప్రచారం బూటకం అని తెలుతుంది. కాకపోతే ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత ప్రభుత్వం పాకిస్తాన్ భూభాగంలోని లక్ష్యాల మీద దాడి చేయడానికి సందేహించదన్న కృతనిశ్చయాన్ని ప్రకటించగలిగింది.

అణ్వాయుధ వాస్తవాలు

అణ్వాయుధం పేరిట బ్లాక్ మెయిలింగ్‌కి పాల్పడితే భారతదేశం ఎంతమాత్రమూ సహించదు. ఈ సాకున రక్షణ కల్పిస్తున్న ఉగ్రవాదుల రహస్య స్థావరాల మీద ఖచ్చితత్వంతో కూడిన నిర్ణయాత్మక దాడులు చేస్తాం అంటూ మోడీ చేసిన లక్ష్మణ రేఖ ప్రకటన పూర్తిగా బాధ్యతా రహితమైనది, డంబాల మారిది. రెండు అణ్వాయుధ దేశాలు యుద్ధానికి తలపడితే అది ఎలాంటి పర్యవసానాలకు దారి తీస్తుందో, ఎక్కడ అణ్వాయుధాల ప్రయోగానికి ప్రేరేపిస్తుందో అని ప్రపంచ దేశాలన్నీ ఆందోళన చెందుతాయి. యుద్ధానికి పాల్పడిన అణ్వాయుధ దేశాల మీద యుద్ధ విరమణ కోసం ఒత్తిడి తెస్తాయి. రక్షణ వ్యవహారాలపై సింగపూర్‌లో జరిగిన సదస్సుకు హాజరైన మన త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ అక్కడ ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో "అణ్వాయుధ స్థాయి కన్నా ముందు సంప్రదాయ పద్ధతుల్లో యుద్ధం చేయడానికి అవకాశాలున్నాయి. అలా కాకుండా రెచ్చగొట్టే ధోరణులకు పోతే కొద్ది గంటల వ్యవధిలోనే పరిస్థితులు చేజారిపోతాయి" అని వివరించారు. అంటే పాక్‌తో తాజాగా తలెత్తిన ఘర్షణలలో అణ్వాయుధ ప్రయోగం బెదిరింపులు చోటుచేసుకుని వుండవు. బహుశా ఇరు పక్షాలనూ తగ్గమని అమెరికా అధికార యంత్రాంగం నచ్చ చెప్పే ప్రయత్నంలో ట్రంప్ యంత్రాంగం అణ్వాయుధ బూచిని తురుపు ముక్కగా వాడి ఉండవచ్చు. సహజంగానే ట్రంప్ అధిక ప్రసంగి. భారత్–పాక్ అధికార వర్గాలతో మధ్యవర్తి చర్చలు చేసిన అమెరికన్ ఉపాధ్యక్షుడు, విదేశాంగ శాఖా మంత్రి తమ జోక్యాన్ని సమర్థించుకోవడానికి అణ్వాయుధ ప్రయోగ ప్రమాదం ఉందన్న సమాచారం తెలిసి మేం వెంటనే రంగంలోకి దిగాల్సి వచ్చిందని వార్తా సంస్థలకు వివరించడం మనం చూశాం.

ఉగ్రవాదాన్ని ఎదిరించడానికి, తుదముట్టించడానికి పూర్తిగా సైనిక చర్యల మీద ఆధారపడాలనే తప్పుడు వ్యూహం మూలంగా తలెత్తే ప్రమాదాలు ఇలానే ఉంటాయి.

ఇక ఉగ్రవాద చర్యల వెనుక ఉన్న పెద్ద తలకాయలకు, ఉగ్రవాదాన్ని ప్రాయోజితం చేస్తున్న ప్రభుత్వానికి మధ్యన ఎలాంటి తేడా లేదని భారతదేశం పరిగణిస్తుందన్న మోడీ ప్రకటన విషయానికి వద్దాం. తీవ్రఇస్లాం వాదంతో ప్రేరేపితమైన ఉగ్రవాద ముఠాలకు పాకిస్తాన్ ప్రభుత్వం వివిధ మార్గాల్లో సాయం అందిస్తుందని మనం నిస్సందేహంగా గుర్తించవచ్చు. పాకిస్తాన్ పౌర ప్రభుత్వాన్ని, ఉగ్రవాద మూకల వెనుక ఉన్న పెద్ద తలకాయలను ఒకే గాటన కట్టడమంటే భవిష్యత్తులో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉన్న అవకాశాలను మనంతట మనమే మూసేసుకుంటున్నట్లే. మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలంటే రేపు మా గడ్డ మీద ఎలాంటి ఉగ్రవాద చర్య చోటు చేసుకున్నా మీ భరతం పడతాం అనే బెదింపు ధోరణి ఎంత మాత్రం అక్కరకు రాదు, కాగా పోగా బయట శక్తుల జోక్యానికి మనమే బాటలు వేసినట్లు అవుతుంది.

కాశ్మీర్ ప్రజలు కీలకం

సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలంటే, ఉగ్రవాద హింసను నిలవరించాలంటే మనం జమ్ము కాశ్మీర్ ప్రజానీకాన్ని విశ్వాసంలోకి తీసుకుని ఎంత పెద్ద ఎత్తున సమీకరించగలుగుతాం అనేది కీలకం. ఈ దిశగా ఏమేరకు మనం కృషి చేస్తే ఆ మేరకు ఉగ్రవాదం మీద విజయం సాధిస్తాం. పహల్గాం దాడి అనంతరం కాశ్మీర్ సాధారణ ప్రజానీకం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున స్పందించారు. ఆర్టికల్ 370 రద్దు చేసి తమ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని మోడీ ప్రభుత్వం దెబ్బ తీసిందని కాశ్మీర్ ప్రజానీకం ఆగ్రహంతో ఉన్నా, ఈ ప్రభుత్వ హయాంలో మరింత పరాయీకరణకు లోనయ్యామన్న ఆక్రోశం ఉన్నప్పటికీ అక్కడి ప్రజానీకం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలకు పూనుకోవడం చిన్నా చితకా విషయం కాదు. ఈ సందర్భాన్ని ఉపయోగ పెట్టుకుని కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాని పునరుద్ధరించి ప్రజానీకం విశ్వాసం చూరగొనడానికి మోడీ ప్రభుత్వ ప్రయత్నించి ఉండాల్సింది. కానీ క్రేంద ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించింది. కాశ్మీర్ ప్రజలపై మరింత తీవ్ర నిర్బంధానికి పాల్పడింది. ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనే పేరిట వేలాది మందిని అదుపులోకి తీసుకున్నది. ఉగ్రవాదుల కుటుంబాల ఆవాసాలను కూల్చింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే పేరిట ఒక ప్రాంత ప్రజానీకంపై ఇంత పెద్ద ఎత్తున రాజ్య అణిచివేతకు పాల్పడడం మోడీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణులకు అద్దం పడుతున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన రాజకీయ చర్యలు చేపట్టి వారిని తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో భాగస్వాములను చెయ్యడానికి బదులుగా మోడీ ప్రభుత్వం అణిచివేతను సాధనంగా చేసుకోవడం దిగ్భ్రాంతికరం.

సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ, దౌత్య, ఆర్థిక, రక్షణ పరమైన చర్యలను కలివిడిగా చేపట్టడమే సరైన విధానం. ఉగ్రవాద వ్యతిరేక రక్షణ వ్యవస్థలను, ఇంటిలిజెన్స్ పని తీరును మరింత మెరుగు పరుచుకోవడానికి తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలి. పహల్గాం దుర్ఘటనకు కారణమైన భద్రతా వ్యవహారాల వైఫల్యం నుండి సరైన గుణపాఠం తీసుకోవాలి.

పాకిస్తాన్‌ను ఏకాకి చెయ్యలేకపోయాం

పహల్గాం దాడి ఘటన జరిగి ఇన్ని వారాలు గడిచాక కూడా అంతర్జాతీయ సమాజంలో పాకిస్తాన్‌ను మనం రాజకీయ పరంగా దౌత్యపరంగా ఒంటరిపాటు చెయ్యలేకపోయాం. పాక్ తాజాగా ఐ.ఎం.ఎఫ్ నుండి రుణం దక్కించుకున్నది. ఇది చాలదన్నట్లు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండి కూడా రుణాలు పొందనున్నది. అన్నిటికీ మించి ఐక్యరాజ్యసమితిలో ఉగ్రవాద సంబంధిత, ఉగ్రవాద వ్యతిరేక కమిటీలకు ప్రతినిధి దేశంగా పాకిస్తాన్ ఎన్నికైంది.

పాకిస్తాన్ మీద మన దేశం చేపట్టిన సైనిక చర్యకు దక్షిణాసియా దేశాలు కానీ మన ఇరుగు పొరుగు దేశాలు కానీ మనకు మద్దతుగా నిలబడకపోవడం ప్రభుత్వ అతి పెద్ద వైఫల్యం. నేపాల్, శ్రీలంక ప్రభుత్వాలు పహల్గాం దాడులను తీవ్రంగా ఖండించాయి. కానీ పాకిస్తాన్‌లో నాలుగు రోజుల పాటు దాడులకు దిగిన నేపథ్యంలో తటస్థ వైఖరి పాటించాయి. సింధూనదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శ్రీలంక రాజకీయ, ప్రభుత్వ పక్షాలలో సందేహాలకు దారి తీసింది. ఇంధన రంగం, మౌలిక సౌకర్యాల కల్పన తదితర రంగాలలో భారతదేశంతో కుదుర్చుకోనున్న ఒప్పందాలపై అనుమానపు నీలినీడలు కమ్ముకున్నాయి. మోడీ ప్రభుత్వ వ్యవహార శైలి పొరుగు దేశల్లో మరిన్ని అనుమానాలకు దారితీసేలా ఉందే తప్ప మోడీ ప్రవచించిన సిద్ధాంతం ప్రయోజనకారిగా లేదు.

సంకుచిత రాజకీయ ప్రయోజనాలు

ఆపరేషన్ సిందూర్‌ను తన పాక్షిక, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి నిస్సిగ్గుగా వాడుకుంటున్న తీరుగానీ, మన సైనిక బలగాలకు బదులుగా ఆపరేషన్ ఖ్యాతి అంతా తనదే అన్నట్లు మోడీ వ్యవహరిస్తున్న తీరుగాని చూస్తే...ఉగ్రవాద వ్యతిరేక పోరాటం పేరిట మోడీ, బిజెపిలు దేశంలో ఉన్మాదం రెచ్చగొట్టడానికి, అన్య మతస్తులను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి పాల్పడుతూ...హిందూ ఓటు బ్యాంకును సంఘటితం చేసుకోవాలనే రాజకీయ లక్షాన్ని నెరవేర్చుకోవడానికి చూస్తున్నదన్న అనుమానాలు నానాటికీ బలపడుతున్నాయి.

మోడీ ప్రవచనాలు దేశీయంగా రాజకీయ సంకుచిత ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఉద్దేశించినవే తప్ప వేరు కాదు. నిజంగానే మోడీ ప్రకటించిన మూడు లక్ష్య ప్రకటనలను ఆచరణలో పెడితే అవి స్వీయ హానికి దారి తియ్యడంతో పాటు, మన దేశాభివృద్ధికి అంతర్జాతీయ సమాజంలో మెరుగైన గుర్తింపుకి చేటు చేస్తాయి.

/ వ్యాసకర్త సిపిఐ(ఎం) పూర్వ ప్రధాన కార్యదర్శి /

అభిప్రాయం

జూన్ 28న ఛలో తెనాలి

తెనాలి పోలీసుల అరాచకాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను నిలదీస్తూ ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు తెనాలి ఐతానగర్ కమ్యూనిటి హాల్‌లో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'మానవ హక్కుల పరిరక్షణ సదస్సు' జరగనుంది. దీనికి రాజకీయ పార్టీల నేతలు, సామాజిక ఉద్యమకారులు, న్యాయవాద సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, దళిత బహుజన ప్రజా సంఘాలు, మానవతా వాదులు, పౌర సమాజం భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. తెనాలి పోలీసులు దళిత, మైనారిటీ యువకులపై ఇటీవల అక్రమంగా కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో విపరీతంగా కొట్టారు. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లో బూటు కాలితో తొక్కిపెట్టి అరికాళ్ళపై లాఠీలు విరిగేట్లుగా అమానుషంగా కొట్టారు. ఈ సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జుడిషియల్ విచారణ జరిపించాలి. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు, మరీ ముఖ్యంగా హోంశాఖా మంత్రివర్యులు...పోలీస్ చట్ట వ్యతిరేక చర్యలను బలపరుస్తూ చేసిన వాఖ్యలపై ఉన్నత న్యాయస్థానాలు, జాతీయ మానవ హక్కుల సంఘం స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నది ఈ మానవ హక్కుల పరిరక్షణ సదస్సు ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వం స్పందించని ఎడల ఉద్యమ కార్యాచరణ చేపడతాం.

- అంద్ర మాల్యాద్రి,
కె.వి.పి.యస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
సెల్ : 9490300366

సందర్భం

ఎమర్జెన్సీకి యాభై ఏళ్ళు


సరిగ్గా యాభై ఏళ్ళ క్రితం మన దేశంలో 1975 జూన్ 25న తేదీ అర్ధరాత్రికి అతి కొద్ది నిమిషాల ముందుగా "అత్యవసర పరిస్థితి" విధించబడింది. అర్ధ శతాబ్ది అనంతరం ఆనాటి 18 మాసాల 'చీకటి రోజుల' గురించి మననం చేసుకుందాం.

1971లో జరిగిన సాధారణ ఎన్నికలలో ఉత్తరప్రదేశ్ లోని రాయబరేలి నియోజకవర్గం నుంచి ఇందిరా గాంధీ ఘన విజయం సాధించారు. అయితే ఎన్నికల అనంతరం ఇందిరా గాంధీపై లక్ష ఓట్ల తేడాతో ఓడిపోయిన సోషలిస్టు పార్టీ అభ్యర్థి రాజ్ నారాయణ్ ఎన్నికల ఫలితాలపై కోర్టుకెక్కారు. ఆ కేసు వాద ప్రతివాదాలలో బయటపడిన అనేక అంశాలు ఎన్నికలలో జరిగిన అవకతవకలు, ప్రభుత్వాధికారులు సాగించిన అధికార దుర్వినియోగాన్ని బయటపెట్టాయి. వాదనలు విన్న అలహాబాద్ హైకోర్టు ఇందిరాగాంధీ ఎన్నికను పక్కన పెట్టడమేగాక ప్రత్యర్థి రాజ్ నారాయణ్ విజయం సాధించినట్లుగా ప్రకటించింది.

అప్పటికే కాంగ్రెస్ పార్టీ విబేధాలతో రెండుగా విడిపోవడం, ఉవ్వెత్తున ఎగిసిన ప్రతిపక్ష ఉద్యమాలు 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం వల్ల దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారడం, కార్మిక రంగం విస్తృతంగా సమ్మెలకు, ఉద్యమాలకు పిలునివ్వడంతో ప్రభుత్వం దాదాపుగా స్తంబించింది. ఈ ఆటుపోట్లకు తట్టుకోలేక ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975 జూన్ 25న అర్ధరాత్రి దేశంలో "అత్యవర పరిస్థితి"ని ప్రకటించింది. ఒక్కసారిగా దేశం యావత్తూ అంధ యుగంలోకి అడుగు పెట్టినట్లయింది. ఎమర్జెన్సీ కేంద్ర ప్రభుత్వానికి అపరిమితమైన అధికారాన్ని కట్టబెట్టింది. వాక్ స్వాతంత్ర్యం మగ్యం కావడం, నలుగురు కలిసి ఒకచోట కూడడంపై నిషేధం, వ్యక్తిగత స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు, భావ ప్రకటనా స్వాతంత్ర్యం హరించడం వంటి అనేక దుశ్చర్యలతో మేధావులు, కార్మిక నాయకులు ఉక్కిరి బిక్కిరయ్యారు. అయితే అసలు ప్రభుత్వం ఆశించింది దేశంలో ఆర్థిక, రాజకీయ అస్థిరతను అధిగమించడం, ప్రతిపక్షాల ఐక్యతను దెబ్బతీయడం, కాని ఆచరణలో మాత్రం ఇందుకు భిన్నమైన ఫలితాలు ఎదురైనాయి.

ప్రముఖ ప్రతిపక్ష నాయకుల్ని అరెస్టు చేయడం (పి.డి యాక్ట్ ద్వారా) పత్రికలపై ఘోరమైన సెన్సార్లు, పౌర హక్కులను హరించడంతోపాటు ప్రచురణ పూర్వమే ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనే షరతులతో పత్రికా సంపాదకులు ఎంతో ఒత్తిడికి గురయ్యారు. ప్రజల ప్రాథమిక హక్కులు హరించబడడం, విచారణ లేకుండా డిటెన్షన్లు సాధారణమయ్యాయి. బలవంతపు కుటుంబ నియంత్రణ మాటున అవివాహితులకు కూడా ఆపరేషన్ చేయించడం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, తప్పుడు కేసులతో ఆరెస్టులు ప్రజానీకంపై ప్రతికూల ప్రభావం చూపాయి.

ఎమర్జెన్సీ చీకటి రోజులుగా పేరొందిన ఆ 18 మాసాలు ప్రజలకు దినదిన గండంగా గడిచింది. స్వయంగా నేను కూడా ఎమర్జెన్సీ బాధితురాలినే. 1975 ఎమర్జెన్సీలో మధుపై అరెస్ట్ వారెంట్ అందింది. అప్పుడు నేను విజయవాడలో ఉద్యోగంలో వున్నాను. నేను హైదరాబాద్‌కు బదిలీ చేయించుకున్నాను. హైదరాబాద్ నగర కార్యదర్శి కా॥ఎస్.వి.భాస్కరరావు అజ్ఞాతంలో మా ఇంట్లోనే వున్నారు. ఎక్కువగా నాన్న వచ్చేవారు. కాటూరు నుంచి నాగళ్ళ జానకిరామయ్య వచ్చి 15 రోజులు వుండి వెళ్లేవారు.



రోజులు గడిచేకొద్దీ ప్రజలలో నిర్బంధాల పట్ల విముఖత పెరిగి సమ్మెలు, నిరసనలు, ప్రదర్శనలు మరింత ఎక్కువయ్యాయి. ఈ ఒత్తిళ్లను తట్టుకోలేని ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు పిలుపునిచ్చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన నిరసనల ప్రచారం ఎన్నికలపై ప్రత్యక్ష ప్రభావం చూపింది. ఇందిరమ్మ, సంజయ్ గాంధి చిత్తు చిత్తుగా ఓడిపోయారు. నాలుగు పార్టీల కలయికతో ఏర్పాటైన జనతా కూటమి విజయం సాధించింది. దాంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న రాత్రి ప్రతిభ అస్సలు నిద్ర పోనేలేదు. మాటిమాటికి కళ్లు తెరిచి ఇందిరా గాంధీ ఓడిపోయిందా? మనం నాన్న దగ్గరకు వెళు_న్నామా? అని అడుగుతూనే వున్నది. తను కోరుకున్నట్లుగానే కొద్దిరోజుల్లోనే మేం ముగ్గురం కలిసి విజయవాడలో వుండగలిగాము.

ఎమర్జెన్సీ యాభయ్యేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంలో మనం గుర్తుంచుకోవాల్సిన విషయాలు కొన్ని వున్నాయి. ఈ అర్ధ శతాబ్దంలో అధికారంలో వున్న పార్టీలు మారినా వారి నిరంకుశ ధోరణిలో మార్పు రాలేదు. అందువల్ల మనం నేటికీ ఎమర్జెన్సీని ఎదుర్కొంటున్న పరిస్థితి. ప్రజాతంత్రవాదులు, ప్రజాస్వామ్య పరిరక్షకులు మరింత జాగరూకులుగా వుండడం ద్వారానే ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను పరిరక్షించుకోగలం.

- వి. సుమతి

కవిత్వం

ఇది శబ్దం లేని ఎమర్జెన్సీ

నాడు,
ఇందిరా గాంధీ ప్రకటించింది
ఇది ఎమర్జెన్సీ అని!
నేతలు అరెస్టయారు
ప్రెస్ ముట్టడయింది
పత్రికల మీద నల్ల ఇంకు పడింది
గొంతుకలు నొక్కబడ్డాయి
కానీ, ఒక్క మాట – దేశం మొత్తం
తెలుసు!

కానీ నేడు
పదేళ్లు దాటి పదకొండు...
ఒక్కటీ చెప్పకుండానే
దేశం చీకటిలోకి జారిపోతోంది.
ఇది ఎమర్జెన్సీ కాదు అనడం
అందరికీ ఒక జోక్ అయిన
రోజులు!

ఒక "అప్రకటిత ఎమర్జెన్సీ"
చూపించకుండా చీకటి
పరిపాలన
చెప్పకుండా చట్టాల రద్దు,
కొందరిని "దేశ ద్రోహులు"గా
ముద్రించి
పరిమిత ప్రజాస్వామ్యాన్ని
పాతాళానికి తోసేస్తున్నారు
రాజ్యాంగాన్ని జెండాగా ఎగురవేస్తూ
వెనక వెనకే దాన్ని కాలుస్తున్నారు,

నాడు
ఒక అర్ధరాత్రి రేడియో గళం
ఇందిరా గాంధీ శబ్దంగా చెప్పింది
"ఈ దేశం ఎమర్జెన్సీ స్థితిలో ఉంది"
అవును, అది నియంతృత్వం
కానీ పట్టదగిన నియంతృత్వం!
అప్పటికీ – ప్రజలు ఎదురుదాడికి
సిద్ధమయ్యారు
నిర్బంధం కనబడింది కనుక
ప్రతిఘటన జనించగలిగింది,

ఇక్కడ "ప్రతి చర్యా అదే "!
పేపర్లలో మిగిలింది ప్రచారం
పత్రికలు, ఏజెన్సీలు
జడ్జీలు కచ్చితంగా "విధేయత"లో
ఇప్పుడు మాటలే నేరంగా మారాయి
రాజ్యాంగం చెవిని కడిగేంతగా
వినిపిస్తుంది,
కానీ
నాయకుల చేతుల్లో దాని పుటలు
ఒక్కొక్కటిగా చింపబడుతున్నాయి,

న్యాయ వ్యవస్థ, మాధ్యమాలు
విద్యాసంస్థలు అన్నీ బలహీనబడ్డాయి.
కానీ ఎవ్వరూ "ఇది ఎమర్జెన్సీ"
అనడంలేదు
కారణం – ఇప్పుడు నామమే చెబితే
జైలు బార్గెయిన్ కింద వస్తుంది!

ఇది శబ్దం లేని ఎమర్జెన్సీ
ఇది ఎమర్జెన్సీ కాదా?
"ఇది అధికారంలో ఉన్న వారికే స్వేచ్ఛ
మిగతావారికి మౌనం కూడా నేరం!"
"ప్రకటించిన ఎమర్జెన్సీకి ప్రజల
ప్రహారం
కాని ఈ అప్రకటిత ఎమర్జెన్సీకి
ప్రతి గళాన్నీ ఖండించే శిక్షా వ్యవస్థ!"

- ఎ. అజ శర్మ

నకిలీ బంగారం తాకట్టు కేసు ఛేదింపు

- నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నార్పల

అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని కీర్తన ప్రయివేటు గోల్డ్‌లోన్ బ్యాంకులో నకిలీ బంగారాన్ని కుదవపెట్టి డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసును నార్పల పోలీసులు ఛేదించారు. వివరాల్లోకి వెళ్తే.. జూన్ 13వ తేదీ నార్పలకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, యల్లనూరుకు చెందిన దాదాపీర్, మహమ్మద్ షఫీ కలిసి ఇమ్రాన్ పేరుపై ఖాతా ఓపెన్ చేసి మొదటసారి నాలుగు నకిలీ బంగారు గాజులు పెట్టి రూ.3,21,693 తీసుకున్నారు. 16వతేదీ 2వసారి నకిలీ బంగారు కడియాలు పెట్టి రూ.3,53,74, 20న 3వసారి మూడు నకిలీ బంగారు గాజులు పెట్టి రూ.2,72,023 తీసుకున్నారు. ఈనేపథ్యంలో జూన్ 23న గోల్డ్ లోన్ క్లస్టర్ మేనేజర్ కొలంట్ల నాగరాజు తనిఖీ చేయగా 125.8 గ్రాములు నకిలీ బంగారంగా గుర్తించారు. వెంటనే నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం నార్పల క్రాసింగ్‌లో నార్పల మహమ్మద్ ఇమ్రాన్, యల్లనూరు దాదాపీర్ (బంగారు ప్యూరీటిని తనిఖీ), తెరుకాటి మహమ్మద్ షఫీ (లోన్ ఆఫీసర్), కంసల మంజునాథ్, షేక్ మహబూబ్‌బాషా, షేక్ అబ్దుల్ రజాక్, షేక్ సాదిక్‌వలి, బాబు, షేక్ యూసూఫ్ బాషాను అదుపులోకి తీసుకున్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ విద్యాలయంలో తరగతి 3, 11, 12 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 26 నుంచి 30వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు కోసం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యాలయంలో సంప్రదించవచ్చని లేదా అప్లికేషన్స్ విద్యాలయ వెబ్సైటు https://vizianagaram.kvs.ac.in లో డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

పిఎస్ఆర్‌కు మరో 2నెలలు బెయిల్

ప్రజాశక్తి, అమరావతి

ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడ్డారని విజయవాడ సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో ప్రథమ నిందితుడైన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు గతంలో ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మరో 2 నెలలు పొడిగించింది. పిటిషనర్ పీఎస్ఆర్‌కు ఈ నెల 25న గుండెకు బైపాస్ ఆపరేషన్ చేశారని ఆయన న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. విజయవాడ కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్ ఉత్తర్వులు గురువారం ముగుస్తుందని చెప్పారు. ఈ వివరాలను జస్టిస్ వై.లక్ష్మణరావు పరిగణనలోకి తీసుకుని మధ్యంతర బెయిల్ గడువును మరో మాసాలకు పొగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీఎస్ఆర్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఆగస్టు 28కి వాయిదా వేశారు.

ఇదే కేసులో రెండో నిందితుడైన క్యామ్ సైన్ డైరెక్టర్ మధుసూదన్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక అప్పగించాలని విజయవాడ జైలు సూపరింటెండెంట్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. మధు గత 50 రోజులుగా జైల్లో ఉన్నారని, అనారోగ్యంతో బాధపడుతున్నారని, జైల్లో వైద్య సదుపాయాల కల్పన చేయడం లేదని న్యాయవాది చెప్పారు. విచారణ జులై 1కి వాయిదా పడింది.

జగన్ క్వాష్ పిటిషన్ విచారణ నేటికి వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతరులపై నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా జగన్ వెళుతున్న వాహనం ఏటుకూరు బైపాస్ వద్ద ఢీకొని చీలి సింగయ్య మరణించాడు. సింగయ్య భార్య చీలి లూర్దు మేరి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. వైఎస్ జగన్, వైవీ సుబ్బారెడ్డి, జగన్ పీఏ కె.నాగేశ్వరరెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజనీలపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని గురువారం జస్టిస్ వై.లక్ష్మణరావు విచారించారు.

కేసును కొట్టేయాలని, ఈలోగా పోలీసులు అరెస్టు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ల న్యాయవాదులు కోరారు. లేనిపక్షంలో పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోబోరని అడ్వొకేట్ జనరల్ హామీ ఇవ్వాలని కోరారు. సుప్రీం కోర్టు సీనియర్ అడ్వొకేట్ సిద్ధార్థ లూథ్రా వాదించేందుకు వస్తారని విచారణను సోమవారానికి వాయిదా వేయాలని ఏజీ కోరారు. విచారణ నేటికి వాయిదా పడింది.

మద్యం కేసు కొట్టేయండి

- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్

ప్రజాశక్తి, అమరావతి

మద్యం కుంభకోణంపై మంగళగిరి సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు, తుడా మాజీ చైర్మన్ మోహిత్ రెడ్డి (ఏ39) హైకోర్టును ఆశ్రయించారు. కేసును కొట్టేయాలని, ఈలోగా తనపై పోలీసులు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలంటూ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి చర్యలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారణ చేయనుంది. ఈ కేసులో తన తండ్రి భాస్కర్‌రెడ్డిని 38వ నిందితుడిగా చేర్చారని, ఎన్నికలప్పుడు మద్యం ముడుపులను వెచ్చించారని, ప్రభుత్వం ఇచ్చిన అధికారిక వాహనంలో ఆ డబ్బును తరలించారంటూ భాస్కర్‌రెడ్డి గన్‌మోన్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. గన్‌మెన్ ప్రభుత్వ ఉద్యోగి కాబట్టి ఆయన అధికారులు చెప్పినట్లుగా వాంగ్మూలం ఇచ్చారన్నారు. అధికారుల ఒత్తిడితో గన్‌మెన్ వాంగ్మూలం ఇచ్చారన్నారు.

కల్తీ నెయ్యి నిందితుల బెయిల్ పిటీషన్

- తీర్పు రిజర్వ్

ప్రజాశక్తి, అమరావతి

టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే కేసులో నిందితులుగా ఉన్న బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్, విపిన్ జైన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. గురువారం ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ కె.శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం నిందితులు ఇద్దరు పోమిల్ జైన్(ఏ3), విపిన్ జైన్(ఏ4) జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. బెయిల్ కోరుతూ వాళ్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేయాలని సీబీఐ న్యాయవాది సురేష్ కుమార్ వాదించారు. సాక్షులను బెదిరించిన ఆధారాలను కోర్టుకు అందజేశారు. అయితే నిందితులు ఇద్దరూ ఫిబ్రవరి నుంచి జైల్లో ఉన్నారని సీనియర్ అడ్వొకేట్ ఎస్.శ్రీరామ్ ప్రతివాదన చేశారు. గత మార్చి, ఏప్రిల్లో పిటిషనర్ల అనుచరులు సాక్షులను బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే జూన్‌లో కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

గీతం బిఎస్‌సి, ఎంఎస్‌సి స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-మధురవాడ (విశాఖ)

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్‌సి, ఎంఎస్‌సి కోర్సులలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు.గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంకా ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో నాలుగేళ్ల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి వివరాల కోసం గీతం వెబ్‌సైట్ ఔఔఔ.స్త్రఙఎ.వఎబ ను సంప్రదించవచ్చునన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు వెల్లడించారు.

వివాహిత గొంతు కోసిన ఉన్మాది అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం టౌన్ (పశ్చిమగోదావరి జిల్లా)

తనతో పెళ్లికి నిరాకరిస్తుందని వివాహిత గొంతు కోసిన నిందితుడిని 24 గంటల్లో అరెస్టు చేశామని డిఎస్‌పి జయసూర్య తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ పర్యవేక్షణలో నిందితుడు పోలిశెట్టి హేమంత్‌ను సాంకేతికత సాయంతో 24 గంటల్లోనే అరెస్టు చేశామన్నారు. అయ్యప్ప ఏజెన్సీలో వివాహిత పని చేస్తున్న సమయంలో అక్కడే పని చేస్తున్న హేమంత్ పరిచయం పెంచుకుని తనను పెళ్లి చేసుకోవాలని వేధించాడని తెలిపారు. ఈ క్రమంలో ఇంటికెళ్లి మళ్లీ పెళ్లి ప్రస్తావన తీసుకురాగా వివాహిత నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో ఆమె గొంతు కోసి, అక్కడి నుంచి పరారయ్యాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్ పాల్గొన్నారు.

నరసాపురం ప్రభుత్వాసుపత్రి ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

- పోస్టుమార్టంకు సొమ్ము వసూళ్లే కారణం

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులపై వేటు పడింది. ఏప్రిల్ 16న మొగల్తూరులో ఉపాధి కూలీల మీదకు వ్యాన్ దూసుకెళ్లిన ప్రమాదంలో జి.గంగాభవాని (50), కె.పావని (47) అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతదేహాలను నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆ మృతదేహాలకు పోస్టుమార్టం చేయడానికి అక్కడి ఉద్యోగులు రూ.3 వేలు సొమ్ము తీసుకున్నారని మృతుల బంధువులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణలో అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అయిన పోస్టుమార్టం అసిస్టెంట్ డి.వెంకటేశ్వరరావును ఉద్యోగం నుండి తొలగించగా, జనరల్ డ్యూటీ అటెండర్ కె.ఉదయబాబును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తరాంధ్రలో 'ఆయుష్' యూనివర్శిటీ

- కేంద్రమంత్రిని కోరిన కొండపల్లి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రలో ఆయుష్ శాఖ ఆధ్వర్యాన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫంక్షనింగ్ యూనివర్శిటీతో కూడిన బయోటెక్ పార్కు స్థాపించాలని కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి ప్రతాపరావు గణపతిరావుజాదవ్‌ను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి కొండపల్లి జాదవ్‌ను కలిశారు. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో సమగ్ర బయోటెక్ పార్కు స్థాపించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, దానికి అవసరమైన అనుమతులు ఇచ్చేలా చూడాలని కోరారు. దీనిలో ప్రాచీన ఆయుర్వేదం, బయోమాలిక్యులర్ విజ్ఞానాన్ని ఆధునీక బయోఫార్మరా రంగంతో సమన్వయం చేయాలనే లక్ష్యం ఉందని తెలిపారు.

హెర్బల్ తయారీ, ప్రకృతి నుండి వచ్చే ఔషధ సంయోగాలను అందిస్తాయని మంత్రి వివరించారు. మొక్కల ఆధారిత సముద్ర జీవ మూలాలను ఉపయోగించి ఔషధాలు తయారు చేస్తామని పేర్కొన్నారు. అలాగే కేంద్ర గ్రామీణాభివృద్ధిశాక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కూడా మంత్రి కలిశారు. అమరావతి, తాడికొండ మండలాలతో సహా సిఆర్‌డిఏ గ్రామాల్లో చిన్న, సన్నకారు, భూమిలేని రైతులకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. లఖ్‌పతీ దీదీ ఇండ్రస్టియల్ పార్కును విజయవాడ సమీపంలోని జక్కంపూడిలో ఏర్పాటు చేయాలని కోరారు. గుంటూరు జిల్లా మోతడకలో గుంటూరు మిర్చి పచ్చళ్ల ఉత్పత్తుల కోసం లైవ్లీహుడ్ టెక్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

70 శాతం మానిఫెస్టో అమలు

- సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 70 శాతం అమలు చేశామని సీడాప్ చైర్మన్ జి దీపక్ రెడ్డి చెప్పారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 700కు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఏడాది నుంచి వైసిపి తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాగా సింగయ్య మృతికి తన కారుకు సంబంధం లేదని చెప్పే ధైర్యం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఉందా అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య నిలదీశారు. తాను ప్రయాణిస్తున్న కారు కింద పడలేదని, వైసిపి కార్యకర్తలే సింగయ్యను టైర్ కింద నుంచి లాగి పక్కన పడేయలేదని చెప్పగలరా అని ప్రశ్నించారు. జగన్ ఐదేళ్ల పాలన అరాచకం, అప్రజాస్వామికం, దౌర్జన్యం, రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు.

గెయిల్ పైప్‌లైన్ విస్ఫోటనానికి 11 ఏళ్లు

- నగరం గ్రామం దత్తత హామీ విస్మరించిన గెయిల్



ప్రజాశక్తి - మామిడికుదురు (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

చమురు, సహజవాయువు అన్వేషణ, పరిశోధన, ఉత్పత్తులకు ప్రధాన నిలయమైన రాజోలు దీవి ప్రాంతంలో ఎక్కడైనా పైపులైను చిన్న లీకేజీ సంఘటన జరిగినా నగరంలో 11 ఏళ్ల క్రితం జరిగిన పైపులైన్ విస్ఫోటాన్ని గుర్తించుకుంటూ ఈ ప్రాంత వాసులు ఆందోళన చెందుతుంటారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరంలో 2014జూన్ 27న గెయిల్ ట్రంక్ పైప్‌లైన్ విస్ఫోటం జరిగి నేటికి 11 ఏళ్లు పూర్తవుతోంది. విస్ఫోటనంలో 22 మంది మృత్యువాతపడగా 18 మంది గాయాలపాలయ్యారు. ఈ ప్రాంతంలోని నివాస గృహాలన్నీ అగ్నికి ఆహుతి కాగా ఆ ఘోర సంఘటన పీడకలగా నేటికీ ఈ ప్రాంత వాసులు కలవరపెడుతోంది. ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు కానరాలేదు. ఆ సమయంలో అప్పటి టిడిపి ప్రభుత్వం, నేతలు, గెయిల్ అధికారులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. రాజోలు దీవిలో మోరి, అడవి పాలెం, కేశనపల్లి క్షేత్రాల పరిధిలో ఎక్కడో ఒక చోట తరచూ లీకేజీలు సంభవిస్తూ ఉంటాయి. మొక్కుబడిగా మరమ్మతులు చేసి ఒఎన్‌జిసి, గెయిల్ సంస్థలు చేతులు దులుపుకుంటాయి. శాశ్వత పరిష్కారం మార్గం కానరావడం లేదని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు

కానరాని దత్తత హామీ

నగరంలో గ్యాస్ ట్రంక్ పైప్ లైన్ విస్ఫోటము నేపథ్యంలో గెయిల్ అధికారులు నగరం గ్రామాన్ని దత్తత తీసుకుని మోడల్ విలేజ్‌గా సకల సౌకర్యాలు కల్పించి తీర్చిదిద్దుతామన్న హామీ 11 ఏళ్లయినా కార్యాచరణకు నోచుకోలేదు. గతంలో గ్రామాభివృద్ధి సంక్షేమ సంఘం నిరసన దీక్ష చేసిన నేపథ్యంలో 18 డిమాండ్లకుగాను 11 అంశాలకు పరిష్కారం చూపుతామని లిఖిత పూర్వక హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేరలేదని ఉద్యమ నాయకుడు జాలెం సుబ్బారావు తదితరులు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలలో వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తామని, నగరంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల హాస్పటల్‌గా అభివృద్ధి చేస్తామని, ఇంటింటికి తాగునీరు, వంటగ్యాస్ ఉచితం గా సరఫరా చేస్తామని పదుల సంఖ్యలో ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని నగరం ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రహదారులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్న రహదారుల విషయాన్ని విస్మరించారు.

మైనర్ మినరల్స్ 2025 పాలసీ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మైనింగ్ పరిశ్రమ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు 1996 మైనర్ మినరల్ చట్టానికి ప్రభుత్వం సరవణ చేసి మైనర్ మినరల్స్ పాలసీ 2025ను విడుదల చేసింది. ఈ మేరకు గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది తీసుకువచ్చిన శాండ్ పాలసీ 2024ను సవరించింది. ఇందుకు సంబంధించి సవరణకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించింది. ఈ పాలసీలో మైనింగ్‌కు ఇచ్చే కన్సెషన్, ఇతర అంశాలను వెల్లడించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడితే వాహనాల వారీగా విధించే జరిమానాల వివరాలను పేర్కొన్నారు.

ట్రాక్టర్‌కు మొదటి సారి రూ.10వేలు, రెండవ సారి రూ.10 నుంచి 20 వేలు, పది టైర్ లారీకి మొదటి సారి 25 వేలు, రెండవసారి 25 నుంచి 50 వేలు, పది కంటే ఎక్కువ టైర్ల వాహనాలకు మొదటి సారి రూ.50 వేలు, రెండవ సారి 50 నుంచి లక్ష, యంత్రాలకు మొదటి సారి రూ.50 వేలు, రెండవ సారి రూ.50 నుంచి లక్ష జరిమానా విధించే అధికారం జిల్లా స్థాయి అధికారులకు అప్పగించారు.

కేరళలో చిన్నారిని విక్రయించిన తల్లిదండ్రులు.?

- కదిరిలో పోలీసుల విచారణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

సత్యసాయి జిల్లా కదిరి మండలం లోని ఓ తండాకు చెందిన దంపతులు శ్రీవాణి, రవీందర్ నాయక్‌కి ముగ్గురు సంతానం కాగా బతుకు దెరువు కోసం వారు కేరళకి వెళ్లారు. అయితే చిన్నారి తండ్రి రవీందర్ నాయక్ అనారోగ్యానికి గురయ్యారు. రవీందర్ నాయక్ చికిత్స కోసం మూడేళ్ల చిన్నారిని కేరళలో విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. కేరళ నుండి చిన్నారి తల్లిదండ్రులు సొంతూరుకు చేరుకున్నారు. చిన్నారి కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు రవీందర్‌నాయక్ దంపతులను నిలదీశారు. చిన్నారి తల్లిదండ్రులకు మూడో సంతానం కావడంతో ఒకవైపు తండ్రి అనారోగ్యం మరోవైపు కుటుంబ పోషణ భారం కావడంతోనే చిన్నారిని విక్రయించినట్లు బంధువులు ఆరోపిస్తూ వారితో గొడవపడ్డారు. చిన్నారి విక్రయ ఘటన బయటకు పొక్కడంతో చిన్నారి తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని కదిరి యుపిఎస్ సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఆరు మంది స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ గురువారం ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు నిచ్చారని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. తిరుపతి జిల్లాకు చెందిన చాంద్ భాషా, అవినాష్, మర్రిచెట్టు నాగరాజు, ధనశేఖర్ అలియాస్ ధనంజయులు, వరదరాజులు అలియాస్ వరదయ్య, మూడే నాగరాజు అలియాస్ గుడుంబా నాగరాజు అలియాస్ నాగరాజు నాయక్ ఎస్వీ ఎన్పి ఫారెస్ట్ రేంజ్ టీఎన్ పాలెం సెక్షన్ కరకంబాడి ఫారెస్ట్ బీట్ లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 2017లో టాస్క్ ఫోర్స్‌కు పట్టుబడ్డారన్నారు. ఈ ఆరుగురిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారన్నారు. కోర్టు ఆదేశానుసారం వీరిని నెల్లూరు సెంట్రల్ జైలుకు అప్పజెప్పడం జరిగిందన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఇంటికే రేషన్ :మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : వృద్ధులు, వికలాంగులకు 5 రోజుల ముందే ఇంటికి రేషన్ సరఫరా చేసే విధానం గురువారం నుంచి ప్రారంభమైందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇంటింటా రేషన్ పేరిట మొబైల్ యూనిట్లతో పంపిణీ కన్నా ప్రస్తుతం డిపోల వ్యవస్థలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై రేషన్‌ను 65 ఏళ్లు నిండిన వృద్ధులకు, వికలాంగులకు జూన్ 26 నుంచే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

'మిల్లెట్ ఉద్యమి భారత్' విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్

హైదరాబాద్‌లో ఆరు రోజుల పాటు నిర్వహించిన 'మిల్లెట్ ఉద్యమి భారత్-2025' గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ ఛైర్మన్ ప్రసన్న శ్రీనివాస్ శరకడం మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నెల 21 నుంచి 26 వరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 25 రాష్ట్రాల నుండి 140 మంది ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. ఆరోగ్యానికి సంబంధించి అనేక ప్రశ్నలకు తమ పోర్టల్‌లో సమాధనాలు లభిస్తాయని శ్రీనివాస్ చెప్పారు. ఇందులో భాగస్వాములైన వారికి కార్యక్రమ చివరి రోజు అయిన గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు తెలిపారు.

నేవీ ప్రధాన కార్యాలయంలో పాక్ గూఢచారి అరెస్ట్

- 'ఆపరేషన్ సిందూర్' సమయంలోనూ సమాచారం లీకైనట్టు అనుమానం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని నేవీ హెడ్‌క్వార్టర్స్‌లో కలకలం రేగింది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి కీలక సమాచారం చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై విశాల్ యాదవ్ అనే ఉద్యోగిని రాజస్థాన్ పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం అరెస్ట్ చేసింది. అతడు కీలకమైన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో కూడా సమాచారం చేరవేసినట్లు అధికారులు గుర్తించారు. హర్యానాకు చెందిన విశాల్ యాదవ్ నేవీ హెడ్‌క్వార్టర్స్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. అతడు సోషల్ మీడియా ద్వారా పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీకి చెందిన ఒక మహిళా హ్యాండ్లర్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు గుర్తించారు. ప్రియా శర్మ అనే పేరుతో పరిచయమైన సదరు మహిళా హ్యాండ్లర్, వ్యూహాత్మకంగా ప్రాముఖ్యత కలిగిన రహస్య సమాచారం రాబట్టేందుకు విశాల్ యాదవ్‌కు డబ్బు చెల్లిస్తోందని సీనియర్ పోలీసు అధికారి విష్ణుకాంత్ గుప్తా తెలిపారు. విశాల్ యాదవ్ సెల్‌ఫోన్ నుంచి స్వాధీనం చేసుకున్న డేటా ద్వారా అతడు నేవీకి సంబంధించిన రహస్య సమాచారంతో పాటు ఇతర రక్షణ విభాగాల వివరాలను కూడా పాకిస్థానీ హ్యాండ్లర్‌కు అందించినట్లు స్పష్టమైందన్నారు. ప్రస్తుతం విశాల్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు.

వియత్నాంలో ఎనిమిది నేరాలకు మరణ శిక్ష మినహాయింపు

హనోయి : వియత్నాం ప్రభుత్వం ఎనిమిది నేరాలను మరణశిక్ష నుండి మినహాయించింది. ప్రభుత్వాన్ని కూల్చడానికి యత్నించడం, మౌలిక సదుపాయాలను దెబ్బతీయడం, నకిలీ మందులను తయారు చేయడం, విక్రయించడం, యుద్ధాలు ప్రారంభించడం, గూఢచర్యం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం మరియు లంచాలు తీసుకోవడం సహా ఎనిమిది నేరాలను మరణ శిక్ష నుండి మినహాయించింది. అలాగే హత్య, పిల్లలపై లైంగిక వేధింపులు, దేశద్రోహం మరియు ఉగ్రవాదం వంటి పది నేరాలకు మరణశిక్ష విధించనున్నట్లు తెలిపింది. ఈ చట్టపరమైన సంస్కరణలకు వియత్నాం చట్టసభసభ్యులు ఆమోదించారని బుధవారం స్థానిక మీడియా తెలిపింది.

కెన్యాలో ఆందోళనాకారులపై పోలీసుల కాల్పులు

- 16 మంది మృతి, 400 మంది గాయాలు

నైరోబి : కెన్యాలో బుధవారం జరిగిన దేశవ్యాప్త ఆందోళనలు హింసాత్మకంగా మారాయి.పోలీసుకాల్పుల్లో 16 మంది మరణించారు. చేందారు, 400 మంది గాయపడ్డారు. గత సంవత్సరం ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో మరణించిన వారిని స్మరించడానికి ఈ నిరసనలు జరిగాయి, ప్రజలు పెద్దసంఖ్యలో రోడ్లపైకి రావడంతో ఘర్షణలు చెలరేగి పోలీసు కాల్పులు చోటుచేసుకున్నాయి.ఈ మరణాలను కెన్యా మానవహక్కుల సంఘం ధృవీకరించింది.పోలీస్ కాల్పుల్లో పలువురు మృతి చెందారని ప్రకటించింది.

గత సంవత్సరంలో పోలీస్ కాల్పుల్లో 60 మందికి పైగా మరణించారు.ఈ సందర్భంగా వారిని స్మరించడానికి వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. నైరోబీ నగరంలో రోడ్లన్నిటిని పోలీసులు తమ ఆదీనంలోకి తీసుకున్నారు. నగరంలోకి బస్సులను అనుమతించలేదు. పార్లమెంట్, రాష్ట్రపతి భవనాలకు పటిష్టమైన భద్రత కల్పించారు. ముఖ్యమైన భవనాలన్నిటినీ మూసేశారు.

అంతా అనుకున్నట్లుగానే!

- ఐఎస్ఎస్‌తో అనుసంధానమైన డ్రాగన్
- ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించిన తొలి భారతీయుడుగా శుభాంశుశుక్లా రికార్డు
- అంతరిక్షం నుండి శుక్లా లైవ్ కాల్



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి లైవ్ కాల్ మాట్లాడుతున్న శుభాంశు శుక్లా. చిత్రంలో ఇతర వ్యోమగ్యాములు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా గురువారం రికార్డు సృష్టించారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా బుధవారం శుక్లాతో సహా నలుగురు వ్యోమగాములను తీసుకుని వెళ్ళిన డ్రాగన్ అంతరిక్ష నౌక భారత కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 4.01 గంటలకు అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమైంది. 4.15 గంటలకు మొత్తంగా డాకింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తర్వాత కాసేపటికి నలుగురు వ్యోమగాములు స్టేషన్ లోకి చేరుకున్నారు. పరస్పర కరచాలనాలు, ఆలింగనాలతో అక్కడ కాసేపు సందడి వాతావరణం నెలకొంది. దీంతో ఇక ప్రయోగాలకు సర్వం సిద్ధమైనట్టైంది.

చిన్న పిల్లాడిలా నేర్చుకుంటున్నా

అంతరిక్ష కేంద్రంలోకి వెళ్ళడానికి ముందుగానే శుక్లా అంతరిక్షం నుండి లైవ్ కాల్‌లో మాట్లాడారు. 'ప్రజలకు రోదసీ నుండి నమస్కారం' అని శుక్లా చెప్పారు. భారరహిత స్థితిలో ఎలా జీవించాలో చిన్న పిల్లాడిలా నేర్చుకుంటున్నానని వ్యాఖ్యానించారు. ఈ శూన్యంలో ఇలా తేలియాడుతూ వుండడం అద్భుతమైన అనుభవమని ఆయన పేర్కొన్నారు. తోటి వ్యోమగాములతో ఇలా కలిసి వుండడం ఆనందంగా వుందన్నారు. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఆ సమయంలో డ్రాగన్ కాప్స్యూల్ భూమి చుట్టూ పరిభ్రమిస్తోంది. అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమవడానికి ముందుగా డ్రాగన్ రెండుసార్లు భూమి చుట్టూ తిరిగింది. అంతరిక్ష నౌక నుండి వీడియో లింక్‌ద్వారా తను అనుభవాలను శుక్లా పంచుకున్నారు. 30రోజులుగా క్వారంటైన్‌లో వుండిపోవడంవల్ల యాక్సియం మిషన్ ప్రారంభానికి ముందుండే ఉద్వేగానికి తాను దూరమయ్యానన్నారు. ఆ సమయంలో 'మనం వెళ్ళాలి' అనే ఆలోచన తప్ప మరేది తన మనసుసలో లేదని అన్నారు. అంతరిక్ష కేంద్రంలో వీలైనంత ఎక్కువసేపు గడుపుతానన్నారు. తన అనుభవాలను ప్రజలతో పంచుకుంటానని చెప్పారు. దాదాపు 15 నిముషాల పాటు ఈ లైవ్ కాల్ సాగింది.

ఐదో వ్యోమగామి జాయ్

ఈ మిషన్‌లో భాగంగా ప్రయోగాలు చేయాల్సిన సైన్స్ ఉపకరణాలతో పాటూ అందమైన ఒక చిన్నారి హంస బొమ్మను కూడా శుక్లా బృందం రోదసీలోకి తీసుకెళ్ళింది. శుక్లా కుమారుడు కియాష్ జంతు ప్రేమికుడు.అందుకే దీన్ని ఎంపిక చేశారు. హంస అనేది విజ్ఞానానికి చిహ్నమని, భారత్‌లో వివేచనకు, స్వచ్ఛతకు ఇది ప్రతీక అని గ్రూపు కెప్టెన్ శుక్లా వ్యాఖ్యానించారు. దాని పేరు 'జాయ్'. ఈ పేరును హంగేరి వ్యోమగామి టిబర్ కపు పెట్టారు. వ్యోమగాముల్లోని మిషన్ స్ఫూర్తికి ఇది ప్రతీక అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌తో పాటు ఈ హంసతో పోలెండ్, హంగేరిలకు కూడా సాంస్కృతిక సంబంధాలున్నాయని శుక్లా తెలిపారు. వ్యోమగాముల మధ్య సాంస్కృతిక ఐక్యతకు ఒక చిహ్నంగా ఇది వుందని యాక్సియం మిషన్ పేర్కొంది. పరిశోధనలంటే కేవలం రాకెట్లు, సైన్స్ ఉపకరణాలే కాదని, భావోద్వేగాలు, సాంస్కతిక, సాంప్రదాయాలు కూడా అని దీనితో రుజువైందని యాక్సియం మిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. దీన్ని నాసాకు చెందిన కెన్నడీ అంతరిక్ష కేంద్రం రూపొందించింది. విభిన్నమైన సంస్కృతులకు ప్రతినిధులైన వ్యోమగాముల మధ్య వారధిగా ఈ జాయ్ నిలిచింది.

జీరో గ్రావిటీ ఇండికేటర్ !

ఈ జాయ్‌ను శూన్య గురుత్వాకర్షణ సూచీగా చూస్తారు. డ్రాగన్ కాప్స్యూల్ రోదసీలోకి వెళ్ళగానే జాయ్ భార రహిత స్థితిలో తేలియాడింది. దీంతో గురుత్వాకర్షణ శూన్యమైందని వ్యోమగాములకు స్పష్టమవుతుంది. దీంతో వారందరూ రోదసీలోకి ప్రవేశించామని తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. భార రహిత స్థితికి చేరిన సూచనగా ఒక బొమ్మను ఎగురవేయడం రోదసీలోకి అడుగిడిన తొలి మానవుడు యూరి గగారిన్‌తో మొదలై అటు తర్వాత రోదసీ యాత్రల్లో ఒక సాంప్రదాయంగా మారింది.

345 రాజకీయ పార్టీల డిలిస్ట్!

- ప్రక్రియ ప్రారంభించిన ఇసి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీల డీలిస్ట్ చేసే ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించింది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను (రిజిష్టర్డ్ అన్‌రికగ్నైడ్జ్ పొలిటికల్ పార్టీస్) గుర్తించింది. వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ఇసి ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా లేవని గుర్తించిన ఇసి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయి. అయితే 345 పార్టీల పేర్ల జాబితాను మాత్రం ఇసి విడుదల చేయలేదు. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2,800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ గుర్తింపు పొందాలంటే సాధారణ ఎన్నికల్లో కనీసం 6 శాతం ఓట్లను లేదా నిర్దష్ట సంఖ్యలో సీట్లను గెలుచుకోవాలి. మిగిలిన పార్టీలను నమోదిత గుర్తింపులేని పార్టీలుగానే పరిగణిస్తారు.

షాంఘై ఉమ్మడి ప్రకటనపై సంతకం చేయని భారత్

బీజింగ్ : చైనా పర్యటనలో ఉన్న కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ఆయన కీలక ప్రసంగం చేశారు. సమావేశం అనంతరం దీనిపై జాయింట్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశారు. అయితే, అందులో పహల్గాం ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది.

చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు. ఇందులో భారత్, చైనా, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకటన పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఉగ్రవాద అంశంపై సదస్సులో భిన్నాభిప్రాయాలు రావడంతో సమావేశం అనంతరం రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఆర్గనైజేషన్ రద్దు చేసింది. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది.పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ రక్షణమంత్రులు ఎదురుపడటం ఇదే తొలిసారి. అయితే, ఈ సదస్సులో వీరిద్దరి మధ్య ఎలాంటి పలకరింపులు జరగలేదు. అలాగే, 2020లో గల్వార్ ఉద్రిక్తత తర్వాత నుంచి భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ ఆర్గనైజేషన్‌లో బెలారస్, చైనా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.



ప్రపంచానికి అసలైన ముప్పు అమెరికానే!

వివిధ దేశాలపై అగ్రరాజ్యం బాంబు దాడుల జాబితాను విడుదల చేసిన చైనా ఎంబసీ


సిరియాపై అమెరికా దాడుల దృశ్యం

మాస్కో : ప్రపంచానికి అసలైన ముప్పు అమెరికానే అని మాస్కోలో చైనా ఎంబసి విమర్శించింది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ చేసిన దాడిని పశ్చిమ దేశాలు, అంతర్జాతీయ మీడియా తీవ్రంగా ఖండిస్తున్నాయని కానీ అదేసమయంలో అమెరికా గత చరిత్రను అందరూ పూర్తిగా విస్మరిస్తున్నారని పేర్కొంది. రెండో ప్రపంచయుద్ధ కాలం నుండి అమెరికా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలపై జరిపిన బాంబు దాడుల జాబితాను చైనా ఎంబసి విడుదల చేసింది. మానవ హక్కులు, అంతర్జాతీయ చట్టాలు, అంతర్జాతీయ భద్రత వంటి విషయాల్లో అమెరికా, పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను బహిర్గతం చేస్తూ ఈ జాబితాను ప్రచురించారు.

అమెరికా దాదాపు 30 దేశాలపై దాడులు జరిపింది. అమెరికా దాడులతో కొన్ని ప్రశ్నలు ఎదరువుతాయని... అమెరికాపై పశ్చిమ దేశాల సమాజం ఎన్నడైనా ఆగ్రహావేశాలను వ్యక్తం చేసిందా?, అమెరికాకు వ్యతిరేకంగా గట్టిగా తన వాణిని వినిపించిందా ?, అమెరికాపై ఒక్కసారైనా ఎవరైనా ఆంక్షలు విధించారా?.. అని ప్రశ్నించింది. 'అంతర్జాతీయ సమాజం అని మనం పిలుచుకునే ఈ ప్రపంచ వ్యవస్థ మౌన ప్రేక్షకురాలిలా చూస్తూ వుండిపోయిందని పేర్కొంది. మరోవైపు అమెరికాప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై బందిపోట్ల మాదిరి దాడులు చేస్తూ వారి కలలను భయానకమైన పీడకలలుగా మారుస్తోంది. అయినా ఎలాంటి ఖండనలు లేవు, ఎలాంటి మందలింపులు లేవు, అసలు ఏ రకమైనా ఆగ్రహం లేదు. పిరికి, సిగ్గులేని, కపట ప్రపంచపు మనస్సాక్షి ఇది' అని పేర్కొంది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ ప్రతీకార చర్యగా దాడి చేయగానే అమెరికా దాని మిత్రపక్షాలు ఇరాన్‌ను ప్రపంచ ముప్పుగా పేర్కొంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అసలు ప్రపంచడానికి నిజమైన ముప్పు ఎవరో గుర్తు చేయడానికి చైనా ఎంబసీ ఈ జాబితాను విడుదల చేసింది. అమెరికా చరిత్ర, వర్తమానాన్ని చూస్తే అన్నీ మానవ హక్కుల ఉల్లంఘనలే, అంతర్జాతీయ దురాక్రమణలేనని అందువల్ల నైతికత గురించి మాట్లాడే అర్హత అమెరికాకు లేదని చైనా స్పష్టం చేసింది.

రెండో ప్రపంచ యుద్ధం నుంచి వివిధ దేశాలపై అమెరికా బాంబు దాడుల జాబితా

జపాన్‌పై 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో అణుబాంబులు

దేశం	సంవత్సరం
కొరియా, చైనాలపై	1950–53 (కొరియా యుద్ధం)
గ్వాటెమాలా	1954, 1960, 1967, 1969
ఇండోనేషియా	1958
క్యూబా	1959, 1961
కాంగో	1964
లావోస్	1964
వియత్నాం	1961–1973
కంబోడియా	1969–1970
గ్రెనడా	1983
లెబనాన్	1983, 1984 (లెబనాన్ సిరియాల్లో లక్ష్యాలపై దాడులు)
లిబియా	1986, 2011, 2015
ఎల్ సాల్వడార్	1980
నికరాగ్వా	1980
ఇరాన్	1987
పనామా	1989
ఇరాక్‌పై గల్ఫ్ యుద్ధం	1991,1991–2003 (అమెరికా, బ్రిటీష్ దాడులు), 2003–2015
కువైట్	1991
సోమాలియా	1993, 2007–2008, 2011
బోస్నియా	1994, 1995
సూడాన్	1998
ఆఫ్ఘనిస్తాన్	1998, 2001–2015
యుగోస్లోవియా	1999,
యెమెన్	2002, 2009, 2011, 2024, 2025
పాకిస్తాన్	2007–2015
సిరియా	2014–2015

విజయం సాధించాం!

- కాల్పుల విరమణ తర్వాత మొదటిసారిగా ఖమేనీ ప్రకటన
- అమెరికాను గట్టి దెబ్బ కొట్టామని వ్యాఖ్య



టెహరాన్ : ఇరాన్ విజయం సాధించిందని కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా ఖమేనీ గురువారం తొలిసారిగా బహిరంగ ప్రకటన చేశారు. అమెరికాను గట్టి దెబ్బ కొట్టామని వ్యాఖ్యానించారు. మధ్యప్రాచ్యంలో అమెరికాకు చెందిన ప్రధాన అల్-ఉదైద్ వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ దాడిని అమెరికాకు చెంపపెట్టుగా ఖమేనీ అభివర్ణించారు. ఖమేనీ ప్రకటనను, ఆయన ప్రసంగాన్ని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది.

'అమెరికాను దారుణంగా దెబ్బతీశాం. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా స్థావరాలలో ఒకటైన ప్రధాన అల్-ఉదైద్ వైమానిక స్థావరంపై దాడి చేశాం. దానిని భారీగా నష్టపరిచాం' అని ఖమేనీ వెల్లడించారు. అమెరికా కీలక కేంద్రాల జాడను పసిగట్టామని, అవసరమనుకున్నప్పుడు వాటిపై దాడి చేసే సామర్థ్యం తమకు వున్నదని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలు పునరావృతం కావచ్చునని స్పష్టం చేశారు. శత్రువు దూకుడుగా వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇరాన్, అమెరికాకు ఎన్నటికీ లొంగబోదని ఖమేనీ తేల్చి చెప్పారు. ఈ యుద్ధంలో అమెరికా పొందింది ఏమీ లేదని వ్యాఖ్యానించారు. అమెరికా దాడుల కారణంగా ఇరాన్ అణు కేంద్రాలకు పెద్దగా నష్టం జరగలేదని చెప్పారు.

అమెరికాపై యుద్ధంలో విజయం సాధించినందుకు ఇరాన్‌ను అభినందించారు. "అమెరికాపై విజయం సాధించినందుకు ప్రియతమ ఇరాన్‌కు అభినందనలు. తను జోక్యం చేసుకోకపోతే యూదుల పాలన పూర్తిగా ధ్వంసమవుతుందని భావించినందునే అమెరికా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగింది. యూదు ప్రభుత్వాన్ని కాపాడే ఉద్దేశంతో యుద్ధంలోకి దిగినప్పటికీ అమెరికా సాధించిందేమీ లేదు'. అని ఖమేని పేర్కొన్నారు.

రేషన్ స్థానంలో నగదు బదిలీ..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నగదు బదిలీ పేరుతో నిర్వీర్యం చేయడం సరైంది కాదని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు అంటున్నాయి.

ధాన్యం సేకరణకు దెబ్బ

రేషన్‌కు స్థానంలో నగదు బదిలీ అమలు చేస్తే రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించే పని ప్రభుత్వానికి ఉండదు. దీంతో మిల్లర్లు ధర తొక్కిపెట్టి తక్కువకే కొనుగోలు చేస్తే రైతులకు ఎంఎస్‌పి లభించదు. ప్రభుత్వం ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో 35.94 లక్షలు మెట్రిక్ టన్నులు, రబీ సీజన్‌లో 14.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం వల్ల ధాన్యం పండించిన రైతులకు కొంతైనా ఎంఎస్‌పి లభిస్తుంది. లేని పక్షంలో అత్యధికంగా ధాన్యం పండించే రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా మారుతుంది.

రాజ్యాంగమే అత్యున్నతం : సిజెఐ



ముంబయి : దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమని, ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక, శాసన మరియు న్యాయవ్యవస్థ అనే మూడు విభాగాలు కలిసి రాజ్యాంగం కింద పనిచేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. తూర్పు మహారాష్ట్రలోని తన స్వస్థలమైన అమరావతిలో బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 1973లో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సిజెఐ ప్రస్తావిస్తూ.. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంట్‌కు అధికారాలున్నాయి కానీ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని మార్చలేరని అన్నారు. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక, శాసన మరియు న్యాయవ్యవస్థల్లో ఏ విభాగం అత్యున్నతమైనదో ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుందని అన్నారు. చాలా మంది పార్లమెంట్ అత్యున్నతమైనదని చెబుతుంటారని కానీ రాజ్యాంగమే అత్యున్నతమైనదని అన్నారు.

"ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు జారీ చేసినంత మాత్రాన జడ్జి స్వతంత్రుడు కాడు. జడ్జి ఎల్లప్పుడు తన విధిని గుర్తుంచుకోవాలి. మనం ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, సూత్రాల సంరక్షకులం. మనకు అధికారం మాత్రమే లేదు.. మనపై బాధ్యతలు కూడా ఉన్నాయి " అని అన్నారు. ప్రజలు తీర్పుల గురించి ఏమనుకుంటున్నారు అనేది జడ్జీలను ప్రభావితం చేయకూడదని, మనం స్వతంత్రంగా ఆలోచించాలని అన్నారు. ప్రజలు (న్యాయవ్యవస్థ గురించి) చెప్పింది మన నిర్ణయాన్ని ప్రభావితం చేయదని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ : మావోయిస్టు ప్రభావితం ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. నారాయణపూర్‌లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి.సుందర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మావోయిస్టు మాడ్ డివిజన్‌కు చెందిన పెద్ద క్యాడర్ ఉన్నదన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో అబూజ్‌మడ్ ప్రాంతంలో ఆపరేషన్ జరిపారు. నారాయణ్‌పూర్, కొండగావ్ జిల్లాలకు చెందిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) కలిసి ఈ జాయింట్ ఆపరేషన్‌ను నిర్వహించారు. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు చనిపోయారు. వారి మృతదేహాలతో పాటు ఆయుధాలనూ స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు అధికారులు చెప్పారు.

పలు ఎన్‌కౌంటర్‌లలో 400 మందికి పైగా మావోయిస్టులు మృతి

గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో 400 మందికి పైగా మావోయిస్టులు భద్రతా దళాల జరిపిన పలు ఎన్‌కౌంటర్‌లలో చనిపోయారు. ఈ ఏడాది మే 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీపీఐ(మావోయిస్టు) జనరల్ సెక్రెటరీ నంబాల కేశవ రావు అలియాస్ బసవరాజు (70) మృతి చెందటంతో మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తగిలిని విషయం విదితమే. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆయనతో పాటు 27 మంది మావోయిస్టులు చనిపోయారు. ఈ ఘటన విషయంలో మోడీ సర్కారుపై పౌర సమాజం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

ఇప్పటికే ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులను అంతమొందించాలన్న లక్ష్యంతో కేంద్రంలోని మోడీ సర్కారు వ్యవహరిస్తున్నది. ఇదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ పర్యటనకు వచ్చిన ఆయన.. ఇదే విషయాన్ని చెప్పారు. ఈ ఏడాది వర్షాకాలంలోని మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు జరుగుతాయని వివరించారు. కేంద్రం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలనీ, మావోయిస్టులతో చర్చలు జరపాలనే సూచనలను పౌర సమాజం చేస్తోన్న విషయం విదితమే.

9న సామూహిక నిరసన ప్రదర్శనలకు ఎఐకెఎస్ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయం, పరిశ్రమలను దెబ్బతీసే, జాతీయ ప్రయోజనాలను వదులుకునే ఎటువంటి వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేయవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన విడుదల చేసింది. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం, పరిశ్రమలు రాష్ట్ర జాబితాలో ఉన్నందున, ప్రధానమంత్రి ముందుగా వాణిజ్య ఒప్పందాలపై ముసాయిదా ప్రతిపాదనలను పార్లమెంటులో ఉంచాలని, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతు, కార్మికుల సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. పరస్పర సుంకాలను విధించాలనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జూలై 9 నుండి అమల్లోకి వస్తుందని, ఇండియా-యుకె ఎఫ్‌టిఎ ప్రకటన అలాగే యుఎస్‌ఎతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం, పైప్‌లైన్‌లో ఉన్న అనేక వాణిజ్య ఒప్పందాలు అన్నీ రహస్యంగా ఉన్నాయని తెలిపింది.

"దేశంలోని రైతులు రాబోయే రోజుల్లో పెద్ద పోరాటాలకు సిద్ధం కావాలి. జూలై 9న కార్మిక వర్గం అఖిల భారత సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంగా, రైతులు, వ్యవసాయ కార్మికులు రైతు వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించాలి. విజయం సాధించే వరకు కార్మికులు, రైతులు పోరాడటానికి సిద్ధం కావాలి" అని ఎస్‌కెఎం పిలుపు ఇచ్చింది.

మెక్సికోలో కాల్పులు..

- 12 మంది మృతి

మెక్సికో సిటి : మెక్సికోలో మరోసారి కాల్పులు చోటు చేసుకున్నాయి. గ్వానాజువాటలోని ఇరాపువాటో నగరంలో స్ట్రీట్ ఫెస్టివల్‌పై ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 12 మంది మృతి చెందారు. మరో 20 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో రాత్రివేళ కొందరు వ్యక్తులు ఓ స్ట్రీట్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారంతా డ్రమ్స్ వాయిస్తూ డ్యాన్స్ చేస్తూ ఉండగా.. గుర్తు తెలియని దుండగుడు అక్కడి వచ్చి వారిపై ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనను మెక్సికన్ అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ తీవ్రంగా ఖండించారు. దీనిపై దర్యాప్తుకు ఆదేశించారు. గత నెలలో, గ్వానాజువాటోలోని శాన్ బార్టోలో డి బెర్రియోస్‌లో కాథలిక్ చర్చి నిర్వహించిన పార్టీని లక్ష్యంగా చేసుకుని జరిగిన కాల్పుల్లో ఏడుగురు మరణించిన విషయం తెలిసిందే.

ప్రగతిశీలవాది జోహ్రాన్ మందాని!



న్యూయార్క్ : న్యూయార్క్ నగర మేయర్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి జరిగిన ప్రైమరీలో గెలుపొందిన తొలి ఇండియన్ అమెరికన్, డెమోక్రటిక్ సోషలిస్టు అయిన జోహ్రాన్ మందాని (33) ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. జోహ్రాన్ మందాని మూలాలను పరిశీలిస్తే ఉగాండాలోని కంపాలాలో భారతీయ తల్లిదండ్రులకు జన్మించారు. తల్లి మీరానాయర్ చిత్ర నిర్మాత కాగా, తండ్రి మహమూద్ మందాని విద్యావేత్త. ఏడేళ్ళ వయస్సున్నపుడు ఆయన కుటుంబం న్యూయార్క్‌కు తరలివచ్చింది. 2018లో ఆయన అమెరికన్ పౌరుడిగా మారారు. ఈ ఏడాది ప్రారంభంలోనే సిరియా ఆర్టిస్ట్‌ను వివాహం చేసుకున్నారు. తొలిసారిగా 2020లో న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అప్పటినుండి నగర ప్రగతిశీల విభాగంలో ప్రముఖ వ్యక్తిగా ఎదిగారు. న్యూయార్క్ అసెంబ్లీ డిస్ట్రిక్ట్ 36 ప్రతినిధిగా మూడుసార్లు ఎన్నికయ్యారు. దీంతో ఆయన న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీలో పని చేసిన తొలి దక్షిణాసియా జాతీయుడయ్యారు. తనను తాను ప్రగతిశీలవాదిగా ఆయన అభివర్ణించుకుంటారు. ప్రైమరీలో గెలుపొందడమంటే నవంబరు 4న జరిగే ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థిగా ఆయన పోటీచేయనున్నారని అర్థం. ఒకవేళ ఈ ఎన్నికల్లో ఆయన గెలుపొందితే న్యూయార్క్ నగరానికి తొలి ఇండియన్ అమెరికన్ ముస్లిం మేయర్ అవుతారు. అందరికీ అందుబాటులో వుండడం, సమానత్వం అనే అంశాలపైనే ప్రధానంగా ఆయన ఎన్నికల ప్రచారం వుంది. దీంతో యువత మద్దతు ఎక్కువగా ఆయనకు లభించింది.

మేయర్ అయితే న్యూయార్క్ నగరాన్ని అందరికీ అందుబాటులో వుండేలా మార్చాలన్నది ఆయన ఆలోచన. అద్దెలను పెరగకుండా చూడడం, ఉచితంగా బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం, సార్వజనీన బాలల సంరక్షణ, గృహ నిర్మాణం, అధికంగా కనీస వేతనాలు, నగరంలో జీవన వ్యయ సంక్షోభాన్ని పరిష్కరించడం ఇలా తాను చేపట్టాలనుకుంటున్న చర్యలపై ఆయన వద్ద ప్రణాళికలు వున్నాయి. కచ్చితంగా చర్యలు తీసుకుంటానని ఆయన ఇప్పటికే హామీ ఇచ్చారు. తద్వారా ఈ నగరం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో వుండాలన్నది ఆయన అభిమతంగా వుంది. అలాగే బడా కార్పొరేషన్లు, సంపన్నులైన న్యూయార్కవాసులపై పన్నులు విధించాలన్నది కూడా ఆయన ఆలోచనగా వుంది. ఆయన ఎన్నికల ప్రణాళికను రాడికల్‌గా ఆయన ప్రత్యర్థులు వ్యాఖ్యానించారు. రిపబ్లికన్ల హయాంలో డెమోక్రటిక్ పార్టీ ప్రగతిశీల వర్గానికి కీలకమైనదిగా మందాని గెలుపును చూస్తున్నారు.



చిన్నారి

ప్రయత్నే ఫలి!




సెలవుల్లో రామేశ్వరంలో వున్న తాత ఇంటికి వెళ్లాడు 8వ తరగతి చదువుతున్న రవి. ఓ రోజు రవి వాళ్ల తాతతో క్యారమ్ బోర్డు, చెస్ గేమ్ ఆడాడు. రెండింటిలో ఓడిపోయాడు. చాలా అసహనంగా అక్కడి నుంచి లేచిపోతూ 'పో..తాత! ఓటమి అంటే నాకిష్టం వుండదు, ఎలా గెలవాలో మొదట నేర్పించు' అన్నాడు.

అప్పుడు తాత, "రవీ, నీకే కాదు ఓటమి అంటే ఎవరికీ ఇష్టం వుండదు. మనం క్రికెట్ చూస్తాం కదా! ఎన్నో బంతులను ఎదుర్కొని పరుగులు తీస్తేనే క్రికెటర్స్ సెంచరీలు కొడతారు. అలాగని ప్రతి మ్యాచ్‌లో సెంచరీ కొట్టలేరు కదా! అంటే గెలుపోటములకు అతీతంగా మన ప్రయత్నం కొనసాగించాలి. చంద్రుడిపైకి ఉపగ్రహాలను పంపడానికి మన శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తూనే వున్నారు. చంద్రయాన్-2 ప్రయోగంలో రెండు కిలోమీటర్ల దూరంలో ఓటమి పాలయ్యారు. మళ్ళీ నాలుగు సంవత్సరాలు డే అండ్ నైట్ కష్టపడ్డారు. చివరికి జాబిల్లి గుండెపై నిలబడ్డారు. దీనిని బట్టి ఏం అర్థం చేసుకున్నావు?' అని అడిగాడు.

'గెలిచే వరకూ ఆడాలనీ అర్థమయ్యింది తాత' అన్నాడు రవి. అప్పుడు, తాత నవ్వుతూ, రవి భుజం మీద చెయ్యేసి గెలిచే వరకు కాదురా గెలిచినా, ఓడినా ఆడుతూనే వుండాలి. చంద్రయాన్-3 విజయం తర్వాత మన శాస్త్రవేత్తలు ప్రయోగాలు ఆపలేదు. గగన్‌యాన్‌కు సిద్ధమయ్యారు కదా' అంటాడు. 'ఇప్పుడు నాకు బాగా అర్థమైంది తాత, పదా! చెస్ గేమ్ మళ్లీ ఆడదాం' అని తాతని హాల్లోకి తీసుకెళ్లాడు రవి.

- ఫిజిక్స్ అరుణ్ కుమార్,
93947 49536.

ఖాళీలు నింపండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన తెలుగు పదాలను ఇంగ్లీషులో ఏమంటారో రాయండి. పక్కన ఇచ్చిన క్లూ మీ పనిని సులువు చేస్తుంది. ట్రై చేయండి మరి.

టైర్	T -- e
కథ	T -- e
స్వరం	T -- e
తీసుకో	T -- e
టేబుల్	T -- e

నేను గీసిన బొమ్మ



ఎ.గురు రజని,
4వ తరగతి,
మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల,
రాయవరం (జనరల్),
మార్కాపురం,
ప్రకాశం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సారథం

గొప్ప పనులు బలంతో కాదు, పట్టుదలతో సాధ్యమవుతాయి.

మీ కోసం

ఉప్పులో నీరు చేరకుండా ఉండాలంటే అందులో పచ్చి మిరపకాయ వేయాలి.



JEEVANA జీవన the family

వర్షాకాలం.. స్కూలు.. పిల్లలు ...



వర్షాకాలంలో పిల్లల యూనిఫారమ్స్, షూ, సాక్సులు శుభ్రం చేయడం పెద్ద పని. ఎంతగా శుభ్రం చేసినా సరిగ్గా ఎండక, వాసన వస్తుంటాయి. ఎలా ఉన్నా రోజూ వాటిని ధరించే పిల్లలు స్కూలుకి వెళ్లాలి. దీంతో ఎక్కడ అనారోగ్య సమస్యలు వస్తాయోనని పెద్దలు గాబరా పడుతుంటారు. ఈ టెన్షన్ లేకుండా ఎంచక్కా, సులభమైన పద్ధతిలో వీటిని శుభ్రం చేసుకోవచ్చు.

- వర్షంలో తడిసిన యూనిఫామ్, షూ, సాక్స్‌లను రాత్రంతా ఫ్యాన్ వద్ద ఆరబెట్టాలి. ఉదయం వాటిని శుభ్రం చేస్తే త్వరగా ఎండుతాయి. వాసన రావు.
- బట్టలు నానబెట్టేటప్పుడు డెటోల్ లేదా సేఫ్ హ్యాండ్‌వాష్ జోడిస్తే క్రిములు నశిస్తాయి.
- షూస్ లోపల పేపర్ నింపి ఆరనివ్వాలి. ఇలా చేయడం వల్ల వాసన రాదు.
- సాక్సులు రోజూ మార్చాలి. వీటిని ఉతికేటప్పుడు వెనిగర్ లేదా బేకింగ్ సోడా చుక్కలు వేస్తే వాసన పోతుంది.
- శుభ్రం చేసిన యూనిఫామ్‌ని పెట్టే అరల్లో నాఫ్తలిన్ బాల్స్ పెట్టాలి. ఇలా చేస్తే క్రిములు దూరంగా ఉంటాయి.
- యూనిఫారమ్ వేసేటప్పుడు అండర్ షర్ట్ వేస్తే, చెమట వాసన రాకుండా యూనిఫారమ్ శుభ్రంగా ఉంటుంది.

బ్యాగుల సంరక్షణ

- వాటర్‌ప్రూఫ్ బ్యాగ్స్, రెయిన్‌కోట్, గొడుగు రోజూ పిల్లలతో పంపించాలి.
- పుస్తకాలు ప్లాస్టిక్ ఫైల్స్‌లో పెట్టితే నీరు లోపలికి రాదు.
- బ్యాగ్‌ను వారానికి ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయాలి.
- బ్యాగ్ లోపల పెద్ద ప్లాస్టిక్ కవర్‌ని పెట్టి అందులో పుస్తకాలు పెట్టుకున్నా వర్షానికి పాడవ్వవు.

వ్యక్తిగత శుభ్రత

- స్కూల్ నుంచి వచ్చిన వెంటనే చేతులు, కాళ్లు, ముఖం కడగాలి.
- చిన్న టవల్, అదనపు సాక్స్, మాస్క్ స్కూల్ బ్యాగ్‌లో ఉండేలా చూడాలి.
- మడమల దగ్గర చెమట వల్ల ఫంగస్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి మడతల దగ్గర టాల్క్ పౌడర్ వాడాలి.
- తడి బట్టలతో ఎక్కువసేపు ఉంచకూడదు.
- తగినంత నీరు తాగాలి.
- వీలును బట్టి ప్లాస్టిక్ షూస్ వాడడం మంచిది.
- ఎప్పటికప్పుడు వండిన పదార్థాలనే పిల్లలకు పెట్టాలి.



మెంతులు ఎంతో మంచివి

చేదని చాలామంది దూరం పెట్టే మెంతులు ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తాయి.

- మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మేలు చేస్తాయి. మధుమేహం ఉన్నవారికి బాగా ఉపయోగపడతాయి.
- శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- పురుషులలో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడంలో మెంతులు తోడ్పడతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.
- తల్లిపాల ఉత్పత్తిని పెంచడంలో మేలు చేస్తాయి.
- ఋతుక్రమ సమయంలో వచ్చే నొప్పులను తగ్గించడంలో మేలు చేస్తాయి.
- జీర్ణక్రియను మెరుగుపరచడంలో తోడ్పడతాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తాయి.
- జుట్టు రాలడాన్ని తగ్గించి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి.
- చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి.

మెంతులతో ఇలా ... : రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగాలి. – మెంతులను పొడిగా చేసి, ఆహారంలో ఉపయోగించవచ్చు. మెంతుల గింజలను నమలడం లేదా మొలకెత్తించి తీసుకోవడం వంటివి కూడా చేయవచ్చు.

జాగ్రత్తలు : కొంతమందిలో మెంతులు తీసుకుంటే అలెర్జీలు లేదా ఇతర దుష్ప్రభావాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

- గర్భధారణ సమయంలో మెంతులను ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు.
- ఏదైనా ఆరోగ్య సమస్యతో బాధపడుతుంటే, మెంతులను తీసుకోవడానికి ముందు వైద్యుడిని సంప్రదించాలి.

కరివేపాకుతో మేలు



కరివేపాకు మంచిదని అందరికీ తెలుసు. కానీ, ఇష్టంలేకో లేక అలవాటులో పొరపాటో కరివేపాకుని చాలామంది ఏరిపారేస్తారు. అయితే కరివేపాకు వల్ల వచ్చే లాభాలు తెలిస్తే మాత్రం చక్కగా నమిలేస్తారని నిపుణులు చెబుతున్నారు.

- కరివేపాకులో శరీరానికి ఎంతో అవసరమైన కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు, బి విటమిన్, కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. తాజా కరివేపాకు నుంచి ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, పీచు పదార్థాలు, ఖనిజ లవణాలు, క్యాలరీలు కూడా లభిస్తాయి.
- కరివేపాకులో పౌష్టిక విలువలు మాత్రమే కాదు, ఔషధ గుణాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి.
- ఇందులోని కొయినిజన్ వంటి కొన్ని రసాయనాలు చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తాయి. తీసుకున్న ఆహారాన్ని గ్లూకోజ్‌గా మార్చి రక్తంలో చక్కెర శాతాన్ని పెంచేందుకు క్లోమగ్రంధి నుంచి విడుదలయ్యే అల్ఫాఎమిలేజ్ అనే ఎంజైమే కారణం. కరివేపాకులోని ప్రత్యేక పదార్థాలు ఈ ఎంజైమ్ స్రావాన్ని తగ్గిస్తాయని పరిశోధనల ద్వారా తేల్చారు.
- పిల్లల్లో ఆకలి మందగిస్తే కరివేపాకు, మెంతులు, మిరియాలతో తయారు చేసిన పొడిలో కాస్తంత నెయ్యి వేసి రోజూ రెండు ముద్దలు పెడితే ఆకలి పెరుగుతుంది. అజీర్తి తగ్గుతుంది.
- కరివేపాకు వేసి కాచిన నూనెని తలకి మర్దన చేస్తే శిరోజాలు ఆరోగ్యంగా మెరుస్తాయి. పెరుగుతాయి కూడా.





ఒకే వేదికపై ...

విజయ్ దేవరకొండ, రామ్ చరణ్ ఒకే వేదికపై సందడి చేయనున్నారు. డ్రగ్స్ వ్యతిరేకంగా ఈ నటులు తమ గొంతు కలపనున్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ ప్రత్యేక అతిథులుగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం జూన్ 27న, సాయంత్రం 4 గంటలకు శిల్పకళా వేదికలో జరగనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, వాటి దుష్ప్రభావాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. సినీ తారలు హాజరుకావడం ద్వారా ఈ సందేశం మరింత మందికి చేరుతుందని భావిస్తున్నారు.

'విమర్శిస్తే ఊరుకునేది లేదు..'



మోహన్ బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రం 'కన్నప్ప'. ఈ శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం గురించి చిత్రబృందం సోషల్ మీడియాలో ఓ నోట్ విడుదల చేసింది. 'అన్ని రకాల అనుమతులు, జాగ్రత్తలతో 'కన్నప్ప' సినిమాను తీసినా... ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా, కువిమర్శలను, వ్యక్తిగత హననానికి పాల్పడితే తాము తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంద'ని ఈ నోట్‌లో హెచ్చరించారు. ఈ విషయమై తాజాగా మూవీ మేకర్స్ పబ్లిక్ కాషన్ నోటీస్‌ను సోషల్ మీడియా ఫ్లాట్‌ఫారమ్‌లో పోస్ట్ చేశారు. 'ఎలాంటి అపోహలకు, ముందస్తు అంచనాలకు పోకుండా తమ చిత్రాన్ని చూడాలని, నచ్చితే దాని గురించి రాయాలని అలా కాకుండా తమ కుటుంబం మీద ఉద్దేశ్యపూర్వకంగా విమర్శలు చేస్తూ పరువుకు భంగం కలిగిస్తే కోర్టు ద్వారా చర్యలు తీసుకుంటామని, ఆ రకంగా ముందే ఢిల్లీ హైకోర్టు నుంచి అనుమతి పొందామ'ని తెలిపారు.

2027లో 'బిచ్చగాడు-3'



విజయ్ ఆంటోనీ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'మార్గన్'. క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాకు లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. విజయ్ ఆంటోనీ ఫిలింస్ కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోనీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాను తెలుగులో సురేష్ ప్రొడక్షన్ విడుదల చేయబోతుంది. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో ముచ్చటించిన విజయ్ తన రాబోయే చిత్రాల గురించి మాట్లాడారు. 'ప్రస్తుతం నేను బిచ్చగాడు 3 సినిమాను తెరకెక్కిస్తున్నాను. 2027లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంద'ని చెప్పారు.

'తమ్ముడు'తో పునఃప్రవేశం : లయ



'నేను 2023 ఫిబ్రవరిలో ఇండియాకు వచ్చాను. ఇక్కడ కొన్ని యూట్యూబ్ ఛానళ్లకు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాను. వాటిని చూసి జూన్‌లో 'తమ్ముడు' మూవీ టీమ్ నుంచి కాల్ వచ్చింది. నేను తీసుకున్న కొన్ని ఫొటోలు పంపిస్తే, వాటిలో ఈ క్యారెక్టర్‌కు సెట్ అయ్యేలా కనిపించలేదన్నారు. మళ్లీ ఫొటోషూట్ చేసి పంపమన్నారు. ఆ ఫొటోస్ చూసి సెలెక్ట్ చేసుకున్నారు. అప్పటికి లైన్‌గా 'తమ్ముడు' కథ తెలుసు. నా రీ ఎంట్రీకి ఇది సరైన సినిమా అనిపించింది. క్యారెక్టర్ కోసం కొంచెం లావు కావాలని చెప్పారు. స్వీట్స్ తిని బరువు పెరిగాను. ఝూన్సీ కిరణ్మయి అనే క్యారెక్టర్‌లో నటించాను. తనొక ఆఫీసర్. స్ట్రిక్ట్‌గా ఉంటుంది. కుటుంబాన్ని చూసుకుంటూనే, ఆఫీసర్‌గా నా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాను. హీరో నితిన్‌కు సోదరి పాత్ర నాది. ఈ చిత్రం కోసం అడవిలో షూటింగ్ చేశాం. రోజూ యూనిట్‌లో ఎవరో ఒకరికి గాయాలు అయ్యేవి. మేము పిక్నిక్‌లా చేయలేదు. కష్టపడాల్సి వచ్చింది. మూవీ బాగా వస్తుందనే సంతోషంలో అంతా యూనిటీగా పనిచేశాం. చాలా డెడికేటెడ్‌గా వర్క్‌చేశాం. పవన్ కల్యాణ్ తమ్ముడు మూవీకి ఈ చిత్రానికి పోలిక లేదు' అని కథానాయిక లయ అన్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'తమ్ముడు' చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. నితిన్, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలకపాత్రలు పోషించారు. జులై 4న ఈ సినిమా విడుదల కానుంది.



'నేను రెడీ' టైటిల్, గ్లింప్స్ విడుదల

హవీష్, కావ్య థాపర్ జంటగా నటిస్తున్న సినిమా 'నేను రెడీ'. నువ్విలా, జీనియస్, రామ్‌లీలా, సెవెన్ వంటి సినిమాల్లో నటించి హవీష్ పేరు తెచ్చుకున్నారు. సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాకా వంటి హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబోలో ఈ సినిమా రూపొందుతోంది. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి టైటిల్, గ్లింప్స్‌ను పలువురు సినీ ప్రముఖులు హైదరాబాద్‌లో గురువారం విడుదల చేశారు. చైల్డ్ ఆర్టిస్ట్ రోహన్‌రాయ్, నటుడు బలగం సత్యనారాయణ, నటీమణులు, జయవాణి, రూపలక్ష్మి, మహతి, హరితేజ, నటులు మాణిక్ రెడ్డి, గోపరాజు రమణ, ఎడిటర్ ప్రవీణ్‌పూడి, సినీ రచయిత విక్రాంత్ శ్రీనివాస్ మాట్లాడారు.

టెస్టుల్లోనూ స్టాప్‌క్లాక్

నిమిషం ఆలస్యమైతే 5 పరుగులు పెనాల్టీ

2025-27 డబ్ల్యూటీసీ నుంచి అమలు



దుబాయ్ : స్టాప్‌క్లాక్ నిబంధన ఇక నుంచి అన్ని ఫార్మాట్లలోనూ అమలు కానుంది. వైట్‌బాల్ ఫార్మాట్‌లో స్లో ఓవర్‌రేట్‌ను అధిగమించేందుకు 2024, జూన్ 1 నుంచి స్టాప్‌క్లాక్ రూల్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. టెస్టు క్రికెట్‌లోనూ స్లో ఓవర్‌రేట్ సమస్య పరిష్కారానికి స్టాప్‌క్లాక్ రూల్‌ను అమలు చేయనున్నారు. స్టాప్‌క్లాక్‌తో పాటు పలు ఇతర నిబంధనలను సైతం ఐసీసీ అమలు చేయనుంది. ఈ మేరకు క్రికెట్ కమిటీ చేసిన సిఫారసులను ఐసీసీ ఆమోదించింది.

ఐదు పరుగుల పెనాల్టీ :

నూతన నిబంధనల ప్రకారం ప్రతి రెండు ఓవర్ల మధ్య 60 సెకండ్ల కంటే ఎక్కువ విరామం ఉండకూడదు. ఓ ఓవర్‌లో ఆరో బంతి పడిన తర్వాత.. మరో ఓవర్‌లో తొలి బంతి 60 సెకండ్ల లోపు పడాలి. లేదంటే ఫీల్డ్ అంపైర్లు తొలుత రెండు సార్లు హెచ్చరిక జారీ చేస్తారు. మూడోసారి సైతం ఇదే పునరావృతమైతే.. బ్యాటింగ్‌కు జట్టుకు ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తారు. రెండు సార్ల తర్వాత, ఎన్ని సార్లు నిమిషం ఆలస్యమైతే అన్ని సార్లు 5 పరుగుల పెనాల్టీ వేస్తారు. 2025-26 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ నుంచే ఈ నిబంధన అమలు కానుంది.

ఉమ్మి పడితే.. అంతే! :



టెస్టు క్రికెట్‌లో బంతి స్వభావం మారినట్టు అనిపిస్తే.. ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ మరో బంతి అడిగే వీలుంటుంది. బంతిపై ఉమ్మి వాడకంపై నిషేధం కొనసాగుతున్నప్పటికీ.. ఫీల్డింగ్ జట్టు బంతిపై ఉమ్మి వాడినట్టు అంపైర్ భావిస్తే ఆ జట్టుకు మరో బంతిని నిరాకరిస్తారు. బంతి స్వరూపం మార్చేందుకు ఫీల్డింగ్ జట్టు కావాలని ఉమ్మి వాడినా, సాధారణంగా మెరుపు పొగొట్టేందుకు ఉమ్మి వాడినా.. ఆ కారణంగా బంతి స్వరూపం మారితే అంపైర్లు మరో బంతిని ఇవ్వరు. ఈ విషయంలో అంపైర్ల నిర్ణయమే తుది నిర్ణయం.

నో బాల్‌కు క్యాచౌట్ అయితే.. :

నో బాల్‌కు క్యాచ్ పట్టినప్పుడు కొత్త నిబంధనలు అమలు చేయనున్నారు. టీవీ అంపైర్ తొలుత నో బాల్‌ను పరిశీలించి.. ఆ తర్వాత క్యాచ్‌ను ఎలా అందుకున్న విధానంపై టీవీ రీప్లేలో చూస్తారు. ఇప్పటివరకు నో బాల్‌కు క్యాచ్ ఫెయిర్‌నెస్‌ను పరిశీలించేవారు కాదు. కొత్త నిబంధనల ప్రకారం.. నో బాల్ అయినా.. క్యాచ్ ఫెయిర్‌నెస్‌ను బట్టి పరుగులను ఇస్తారు. క్యాచ్‌ను ఫెయిర్‌గా అందుకుంటే వికెట్ల మధ్య పరుగులను పరిగణనలోకి తీసుకోరు. క్యాచ్ ఫెయిర్‌గా లేకుంటే.. నో బాల్‌కు ఒక్క పరుగును ఇస్తారు. వికెట్ల మధ్య తీసిన పరుగులను లెక్కలోకి తీసుకోరు.

కొత్త ఆటగాడికి ట్రయల్ :

టెస్టు క్రికెట్‌లో ప్రస్తుతం కంకషన్ ప్లేయర్ నిబంధన అమల్లో ఉంది.తలకు బలమైన గాయం తగిలినప్పుడు మ్యాచ్ రిఫరీ.. అటువంటి ప్రత్యామ్నాయ ఆటగాడిని కంకషన్ ఆటగాడిగా తీసుకుంటారు.

మైదానంలో ఆటగాళ్లు తీవ్ర గాయానికి గురైన సమయంలో సబ్‌స్టిట్యూట్ ఆటగాడి సేవలు అందుబాటులో లేవు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఆటగాడిని ఆడించేందుకు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. ఈ మేరకు అన్ని దేశాల క్రికెట్ బోర్డులకు ఐసీసీ మార్గదర్శకాలు జారీ చేసింది.

'స్వర్ణం సాధించినా సంతృప్తి లేదు'

ఒస్ట్రావా (చెక్ రిపబ్లిక్): గోల్డెన్ స్పైక్ టైటిల్ గెలిచినప్పటికీ భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా తన ప్రదర్శన పట్ల సంతృప్తిగా లేడు. అతడు 85.29 మీటర్ల త్రో తో విజేతగా నిలిచాడు. "నా ప్రదర్శనతో సంతోషంగా లేను. కానీ ట్రోఫీ గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. చిన్నప్పుడు ఈ మీట్‌ను బాగా చూసేవాణ్ని. జాన్ జెలెన్జీ, ఉసేన్ బోల్ట్ వంటి వాళ్లు గోల్డెన్ స్పైక్‌లో నెగ్గడం చూశా. నేను కూడా ఇక్కడ నెగ్గాలని కలలు కనేవాణ్ని. ఇప్పుడు కల నెరవేరింది" అని నీరజ్ అన్నాడు. "ఇక్కడ జావెలిన్ త్రోను బాగా చూస్తారు. ప్రేక్షకుల నుంచి మాకు ఎంతో మద్దతు లభించింది. వాళ్ల కోసం ఇంకా మెరుగైన ప్రదర్శన చేస్తే బాగుండేది" అని చెప్పాడు. 27 ఏళ్ల చోప్రా దోహా డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల మార్కును అందుకున్న సంగతి తెలిసిందే. అతడు ఆ మార్కును దాటడం అదే తొలిసారి. గోల్డెన్ స్పైక్‌లో నీరజ్ ఫౌల్‌తో మొదలెట్టాడు. రెండో ప్రయత్నంలో 83.45 మీటర్ల త్రో చేశాడు. మూడో ప్రయత్నంలో త్రో (85.29మీ) చివరికి అతడికి పసిడిని అందించింది. నాలుగు, అయిదో ప్రయత్నాల్లో వరుసగా 82.17, 81.01 మీటర్లు త్రో చేసిన నీరజ్.. ఆఖరి రౌండ్లో ఫౌల్ చేశాడు. నీరజ్ తర్వాత ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్లో పోటీపడతాడు. ఈ ఈవెంట్ జులై 5న బెంగళూరులో జరుగుతుంది. అండర్సన్ పీటర్స్, థామస్ రోచ్లర్ వంటి ఆటగాళ్లు ఇందులో బరిలోకి దిగొచ్చని భావిస్తున్నారు.

నాలుగేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి జోఫ్రా ఆర్చర్

లండన్ : అండర్సన్-తెందూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్-ఇంగ్లర్ మధ్య జులై 2 నుంచి రెండో టెస్టు ప్రారంభంకానుంది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ కోసం ఇంగ్లాండ్ 15 మంది సభ్యులతో జట్టును ప్రకటించింది. ఫాస్ట్‌బౌలర్ జోఫ్రా ఆర్చర్ నాలుగేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చాడు. ఈ ఒక్క మార్పు మినహా లీడ్స్ టెస్టులో ఆడిన మిగతా జట్టును యథావిధిగా కొనసాగించింది. 30 ఏళ్ల ఆర్చర్ తన చివరి టెస్టు ఫిబ్రవరి, 2021లో భారత్‌పైనే ఆడాడు. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు, గాయాలతో రెడ్‌బాల్ క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవల కౌంటీ క్రికెట్‌లో ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకోవడంతో టెస్టు జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు.

ఇంగ్లాండ్ జట్టు :

బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, జేమీ ఓవర్టన్, ఓలీ పోప్, జో రూట్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), జోష్ టంగ్, క్రిస్ వోక్స్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68